వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

Published From : Rangareddy VOLUME : 01 Issue : 294 Wednesday, 14-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

భారత సైన్యానికి
మరింత బలం..



7

ఫ్రాన్స్‌లో వందలాది
సూపర్ మార్కెట్లపై సైబర్ దాడి


7

లడఖ్ మాదే!

- 28 ప్రాంతాలకు పేర్లు పెట్టిన భారత్
- భారత్ నిర్ణయంపై చైనా అభ్యంతరం
- చైనా మాటలను పట్టించుకోని భారత్
- మా భూభాగమేనని స్పష్టం చేసిన కేంద్రం
- అధికారిక పటంలో కొత్త పేర్లు
- సరిహద్దు వివాదంపై మళ్లీ రగడ
- లడఖ్‌పై వెనక్కి తగ్గేది లేదన్న భారత్


02

యూపీఐ ఛార్జీలపై
వెనక్కి తగ్గిన కేంద్రం!

- దీపావళి తర్వాతే కొత్త ఛార్జీలు
- రూ.2 వేలకుపైగా చెల్లింపులపై 0.4 శాతం రుసుం
- ఫెస్టివల్ సీజన్‌లో వ్యాపారులకు ఊరట
- సెప్టెంబర్‌లో భారీగా నమోదైన లావాదేవీలు
- ఛార్జీల అమలుపై కొనసాగుతున్న ఉత్కంఠ
- అమలు తేదీ త్వరలో ప్రకటిస్తామన్న ఎన్‌పీసీఐ



02

ఓట్ల చోరీపై వెనక్కి
తగ్గేది లేదు!

ఓట్ల చోరీపై పోరాటం కొనసాగిస్తాం

- రాహుల్ నివాసంలో ఇండియా కూటమి నేతల భేటీ
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు విపక్షాల డిమాండ్
- ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని బీజేపీపై విమర్శలు
- న్యాయం జరిగే వరకు పోరాడతామన్న రాహుల్
- ప్రజా ఉద్యమానికి ప్రజల మద్దతు పెరుగుతోందన్న ఖర్గే
- నిరసనలపై ఆంక్షలను తప్పుబట్టిన విపక్ష నేతలు
- ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయం

న్యూఢిల్లీ,
ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారంపై ఇండియా కూటమి నేతలు మరోసారి ఐక్యంగా గళమెత్తారు. ఓట్ల చోరీ, ఎన్నికల అక్రమాలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నివాసంలో జరిగిన టీ విందు సమావేశం అనంతరం విపక్ష నేతలు మీడియాతో మాట్లాడారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక -మిగతా 2 లో







కాంగ్రెస్‌ది రాజకీయ డ్రామా!

- కాంగ్రెస్ నిరసనలు రాజకీయ డ్రామాలన్న కిషన్‌రెడ్డి
- రాజ్యాంగ సంస్థలపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శ
- రాహుల్ గాంధీ తీరుపై కేంద్ర మంత్రి ఆగ్రహం
- ఓటమికి ఎన్నికల సంఘాన్ని తప్పుబట్టడం సరికాదని వ్యాఖ్య
- దేశం ఒక కుటుంబం సొత్తు కాదని హితవు
- బ్యాలెట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిందని ప్రశ్న
- రేవంత్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- నిరసనలతో ఢిల్లీలో జనజీవనానికి ఇబ్బందులని విమర్శ

న్యూఢిల్లీ,
ఢిల్లీలో గత వారం రోజులుగా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చేస్తున్న నిరసనలు ప్రజాస్వామ్య పోరాటాలు కావని, రాజకీయ డ్రామాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యం పేరుతో రాజ్యాంగం కల్పించిన హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. మంగళవారం తన నివాసంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. -మిగతా 2 లో


02

2029లోనూ
కాంగ్రెస్‌కు ఓటమే!

- రాహుల్ నాయకత్వంపై అమిత్ షా విమర్శలు
- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ ఆరోపణలను తప్పుబట్టిన హోంమంత్రి
- గుజరాత్ ఓటమికి కూడా ఎస్ఐఆర్ కారణమా?
- కాంగ్రెస్ గత ఎన్నికల ఫలితాలపై ప్రస్తావన
- రాహుల్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచే ఓటములంటూ వ్యాఖ్య
- 2029లోనూ పరాజయం తప్పదని జోస్యం
- ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతామన్న రాహుల్
- ఎస్ఐఆర్‌పై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

సిరీస్‌పై భారత్ గురి!

నేడు ఉప్పల్‌లో భారత్-- వెస్టిండీస్ నాలుగో టీ20

- 2-1 ఆధిక్యంతో బరిలోకి టీమ్‌ఇండియా
- గెలిస్తే మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ సొంతం
- సంజు శాంసన్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం
- టాప్ ఆర్డర్‌పైనే భారీ అంచనాలు
- బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉప్పల్ పిచ్
- పరుగుల వర్షం కురుస్తుందా?

02

సిరీస్ కైవసమే లక్ష్యంగా టీమ్‌ఇండియా కీలక పోరుకు సిద్ధమైంది. ఉప్పల్‌లో నేడు వెస్టిండీస్‌తో జరిగే నాలుగో టీ20లో గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది. 2-1 ఆధిక్యంతో బరిలోకి దిగుతున్న టీమిండియాకు టాప్ ఆర్డర్ బ్యాటర్ల ప్రదర్శన కీలకం కానుంది. బ్యాటింగ్‌కు అనుకూలించే ఉప్పల్ పిచ్‌పై పరుగుల వరద పారుతుందా? సంజు శాంసన్, కుల్దీప్ యాదవ్‌లకు తుది జట్టులో అవకాశం దక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.




02

మమతపై హత్యాయత్నం?

- మమత నివాసం వెలుపల ఘటన
- దుర్గాపూజ మండపం ప్రారంభోత్సవానికి వెళ్తుండగా కలకలం
- చీర లాగేందుకు యువతి ప్రయత్నించిందని ఆరోపణ
- చీరలో కత్తి దాచినట్లు టీఎంసీ నేతల వెల్లడి
- ఘటనపై టీఎంసీ శ్రేణుల ఆందోళన
- యువతిని పట్టుకుని పోలీసులకు అప్పగింత



రైతు డిస్కమ్ పేరుతో ఉచిత
విద్యుత్తుకు ఎసరు!

- రైతు డిస్కమ్ జీవోను రద్దు చేయాలి
- ఉచిత కరెంటును ఆపే కుట్ర : హరీశ్‌రావు
- 30 లక్షలకు పైగా కనెక్షన్లు బదిలీ
- 2 వేల మంది సిబ్బందితో ఎలా నడుపుతారు?
- థర్మల్ విద్యుత్తు కేటాయింపు తక్కువగా ఉందని విమర్శ
- రైతులకు కరెంటు ఎలా ఇస్తారని ప్రశ్న
- గురుకులాల టెండర్లను రద్దు చేయాలని డిమాండ్
- కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్,
రైతు డిస్కమ్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్తును దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీశ్‌రావు ఆరోపించారు. విద్యుత్తు రంగ నిపుణులు, ఉద్యోగ సంఘాలు, రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం -మిగతా 2 లో



కేంద్ర మంత్రి మురుగన్
రాజీనామా

- తమిళనాడులో పార్టీ బలోపేతంపై దృష్టి
- క్షేత్రస్థాయిలో పనిచేయాలని నిర్ణయం
- 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా అడుగులు
- మోదీ మంత్రివర్గంలో పనిచేయడం గౌరవమన్న మురుగన్
- కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని వెల్లడి
- మళ్లీ తెరపైకి మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ
- దీపావళికి ముందే మార్పులు జరిగే అవకాశం
- కనీసం ఆరు మంత్రి పదవులు ఖాళీ అయ్యే ఛాన్స్

న్యూఢిల్లీ
కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ రాజీనామాతో కేంద్ర మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తమిళనాడులో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీలో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని భావిస్తున్నట్లు తెలిపారు.
-మిగతా 2 లో

సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు
దసరా కానుక

ఒక్కొక్కరికి రూ. 1,53,912 లాభాల వాటా

- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి
- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 బోనస్
- సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- కార్మికుల సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం
- సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్లు..
- ప్రజాభవన్‌లో మీడియాతో ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి:
సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ. 1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు -మిగతా 2 లో



వార్తసంధ్య
www.vaarthasandhya.com

లడఖ్ మాదే!



న్యూఢిల్లీ:
లడఖ్‌లోని 28 ప్రాంతాలకు పేర్లను ఖరారు చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం చట్టవిరుద్ధమని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు. సరిహద్దులోని ఆ ప్రాంతాలు తమవేనని చైనా వాదించింది. అయితే, చైనా అభ్యంతరాలను భారత్ తోసిపుచ్చింది. లడఖ్ భారతదేశంలో అంతర్భాగమని, దాన్ని ఎవరూ విడదీయలేరని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. చైనా వ్యతిరేకించినంత మాత్రాన వాస్తవాలు మారవని తెలిపారు. స్థానికులతో సంప్రదింపుల తర్వాత ఈ ప్రాంతాల పేర్లను అధికారిక భారత పటంలో చేర్చాలని నిర్ణయించినట్లు వివరించారు. భారత్ పేర్లు ఖరారు చేసిన ప్రాంతాల్లో సరిహద్దు వివాదం ఉన్న గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ కూడా ఉన్నాయి. ఈ నిర్ణయంతో లడఖ్‌పై తమ హక్కులను భారత్ మరోసారి స్పష్టం చేసింది. గల్వాన్ లోయలో భారత, చైనా సైనికుల మధ్య ఘర్షణ జరిగినప్పటి నుంచి ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. సరిహద్దు వివాదంపై చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇరుదేశాలు తమ వాదనలకు కట్టుబడి ఉన్నాయి. తాజా పేర్ల వివాదం మరోసారి ఇరుదేశాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

కాంగ్రెస్‌ది రాజకీయ డ్రామా!

మొదటి తరువాయి

రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడు ఎన్నికల సంఘాన్ని, తమకు అనుకూలంగా తీర్పులు రాకపోతే సుప్రీంకోర్టును తప్పుబట్టడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై కూడా ఒత్తిడి తెచ్చేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయనంత మాత్రాన ఎన్నికల సంఘం తప్పు చేసినట్లు కాదని కిషన్‌రెడ్డి అన్నారు. దేశం ఒక కుటుంబానికి చెందిన ప్రైవేటు ఆస్తి కాదని కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్.. బ్యాలెట్ పేపర్లతో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎందుకు ఓటమి పాలైందని నిలదీశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఓట్ల తొలగింపుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ నిరసనలకు అనుమతులు ఇవ్వకుండా ముందస్తు అరెస్టులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఢిల్లీలో మాత్రం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ ఆందోళనలు చేయడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ నిరసనల కారణంగా ఢిల్లీలో సాధారణ జనజీవనం, వ్యాపార కార్యకలాపాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు.

2029లోనూ కాంగ్రెస్‌కు ఓటమే!



న్యూఢిల్లీ:
ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తప్పుబట్టారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ వరుసగా ఎన్నికల్లో ఓటములు ఎదుర్కొంటోందని విమర్శించారు. 2029 ఎన్నికల్లోనూ ఆ పార్టీకి పరాజయం తప్పదని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశం అనంతరం అమిత్ షా మీడియాతో మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్ తన ఎన్నికల ఓటములకు కారణంగా చూపడాన్ని ఆయన ప్రశ్నించారు. గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి కూడా ఎస్ఐఆర్ కారణమా? అని నిలదీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ 2024 తర్వాత ప్రారంభమైందని అమిత్ షా పేర్కొన్నారు. అయితే, రాహుల్‌గాంధీ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచే కాంగ్రెస్ పలు ఎన్నికల్లో ఓటములు ఎదుర్కొంటోందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్, త్రిపుర, గుజరాత్ రాష్ట్రాల్లో గత కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ విజయాలు సాధించలేకపోయిందని ప్రస్తావించారు. మరోవైపు, దేశ ప్రజాస్వామ్య ప్రక్రియను పరిరక్షించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరుగుతున్నాయన్న కాంగ్రెస్ ఆరోపణలు, వాటిని బీజేపీ ఖండించడం నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వాగ్వాదం మరింత ముదిరింది.

మమతపై హత్యాయత్నం?

కోల్‌కతా

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై హత్యాయత్నం జరిగినట్లు ఆ పార్టీ ఆరోపించింది. కోల్‌కతాలోని కాళీఘాట్ ప్రాంతంలో ఉన్న ఆమె నివాసం వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. దుర్గాపూజ మండపం ప్రారంభోత్సవానికి మమత బయలుదేరుతున్న సమయంలో ఓ యువతి అక్కడికి వచ్చినట్లు టీఎంసీ నేతలు తెలిపారు. ఆమె మమత చీరను లాగేందుకు ప్రయత్నించిందని, చీరలో కత్తి దాచినట్లు గుర్తించామని పేర్కొన్నారు. అప్రమత్తమైన పార్టీ నేతలు, కార్యకర్తలు యువతిని పట్టుకుని కాళీఘాట్ పోలీసులకు అప్పగించారు. అయితే, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసుల అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

కేంద్ర మంత్రి మురుగన్ రాజీనామా

మొదటి తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ వద్ద మంత్రిగా పనిచేయడం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని మురుగన్ పేర్కొన్నారు. అయితే, రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలతో కలిసి పూర్తిస్థాయిలో పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి క్షేత్రస్థాయి కృషి కీలకమని భావిస్తున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. మురుగన్ రాజీనామా నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. దీపావళికి ముందే మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కనీసం ఆరు మంత్రి పదవులు ఖాళీ అయ్యే అవకాశాలున్నట్లు సమాచారం. అయితే, పునర్‌వ్యవస్థీకరణ ఎప్పుడు జరుగుతుంది, ఎవరికి అవకాశం దక్కుతుంది అనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

యూపీఐ ఛార్జీలపై వెనక్కి తగ్గిన కేంద్రం!

-దీపావళి తర్వాతే కొత్త ఛార్జీలు
-రూ.2 వేలకుపైగా చెల్లింపులపై 0.4 శాతం రుసుం
ఫెస్టివల్ సీజన్‌లో వ్యాపారులకు ఊరటలి
సెప్టెంబర్‌లో భారీగా నమోదైన లావాదేవీలు
ఛార్జీల అమలుపై కొనసాగుతున్న ఉత్కంఠ
అమలు తేదీ త్వరలో ప్రకటిస్తామన్న ఎన్‌పీసీఐ



న్యూఢిల్లీ:
యూపీఐ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలు విధించాలన్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెనక్కి తగ్గాయి. ముందుగా ఈ నెల 15 నుంచి అమలు చేయాలని భావించిన ఛార్జీలను దీపావళి తర్వాతే అమల్లోకి తీసుకువస్తామని ఎన్‌పీసీఐ ప్రకటించినట్లు సమాచారం. అయితే, ఛార్జీల విధానంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. ప్రతిపాదన ప్రకారం, వ్యాపారులకు చేసే రూ.2,000 కంటే ఎక్కువ విలువైన కొన్ని యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ ఛార్జీ విధించనున్నారు. ఒక్కో లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 వరకు వసూలు చేయాలని నిర్ణయించారు. డిజిటల్ చెల్లింపులను నిర్వహించే బ్యాంకులు, చెల్లింపుల సంస్థలు వ్యాపారులకు సేవలందించేందుకు ఈ రుసుమును ప్రతిపాదించారు. ఇంధనం, విద్యుత్ వంటి కొన్ని రంగాల్లో లావాదేవీలకు రూ.5 స్థిర రుసుము నిర్ణయించినట్లు సమాచారం. ఎండీఆర్ ఛార్జీల ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా పలువురు వ్యాపారులు, వ్యాపార సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. యూపీఐ చెల్లింపులపై అదనపు భారం పడితే డిజిటల్ చెల్లింపుల వినియోగం తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. నిరసనలో భాగంగా 'నో యూపీఐ డే' పేరుతో ఆందోళనకు దిగాయి. ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉన్న డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు విధించడం వల్ల యూపీఐపై నమ్మకం దెబ్బతినవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు. దేశంలో యూపీఐ వినియోగం భారీగా పెరుగుతోంది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, సెప్టెంబర్‌లో రోజువారీ లావాదేవీలు సగటున 80.2 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం లావాదేవీల సంఖ్య గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 22.6 శాతం పెరిగినట్లు సమాచారం. రోజువారీ లావాదేవీల విలువ సుమారు రూ.97,913 కోట్లుగా నమోదైంది. ఆగస్టుతో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, డిజిటల్ చెల్లింపుల వినియోగం విస్తృతంగానే కొనసాగుతోంది. ఛార్జీల అమలును దీపావళి తర్వాతకు వాయిదా వేయడంతో వ్యాపారులకు తాత్కాలిక ఊరట లభించినప్పటికీ, ప్రతిపాదనపై సందేహాలు మాత్రం కొనసాగుతున్నాయి. యూపీఐ చెల్లింపులపై అదనపు రుసుములు విధిస్తే చిన్న వ్యాపారులు, వినియోగదారులపై ఎలాంటి ప్రభావం పడుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఛార్జీల అమలు విధానం, తుది నిర్ణయంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఓట్ల చోరీపై వెనక్కి తగ్గేది లేదు!

మొదటి తరువాయి

గాంధీ వాద్రా, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోపాటు పలువురు సీనియర్ విపక్ష నేతలు హాజరయ్యారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలి, ఓట్ల చోరీ ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా డిమాండ్‌పై భవిష్యత్తులో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై చర్చించినట్లు సమాచారం. సోమవారం చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం, సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అనంతర పరిణామాలపైనా చర్చించారు. రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని నిర్ణయించారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఓట్ల చోరీకి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతామని అన్నారు. సుప్రీంకోర్టు, భారత ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి గౌరవం ఉందని, న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని తెలిపారు. న్యాయం సాధించే వరకు రాజకీయ, ప్రజా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసి ఎవరూ తప్పించుకోలేరని, ఓట్ల చోరీకి పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలో జరిగిన నిరసనను కేవలం రాజకీయ పార్టీల ప్రదర్శనగా చూడకూడదని, అది దేశ ప్రజల గొంతుక అని రాహుల్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే పోరాటంలో విపక్షాలన్నీ ఏకతాటిపై ఉన్నాయని చెప్పారు. సామాజిక మాధ్యమాల వేదికగా కూడా స్పందిస్తూ ఇండియా కూటమి నేతలు, విపక్ష ఎంపీలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ ప్రతినిధులు కలిసికట్టుగా పోరాటాన్ని కొనసాగిస్తారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ఇండియా కూటమి చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. రాహుల్ గాంధీతోపాటు ఇతర నేతలు ప్రజా సమస్యలను గంభీరంగా ప్రస్తావించారని తెలిపారు. ఢిల్లీలో జరిగిన నిరసనల్లో యువత, సామాన్య ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విపక్షాలు చేస్తున్న పోరాటానికి మద్దతు పెరుగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న తమ ఆరోపణలపై ప్రజలకు వాస్తవాలు వివరిస్తామని అన్నారు. తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ, ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాత్ర ఉందని ఆరోపించారు. ఢిల్లీలో నిరసనలకు జంతర్ మంతర్‌ను వేదికగా ఉపయోగించడంపై ఆంక్షలు విధించడం, ప్రత్యామ్నాయ ప్రాంతాలకు నిరసనలను మార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది విపక్ష ఉద్యమంపై ప్రభుత్వానికి ఉన్న భయాన్ని చూపుతోందని విమర్శించారు. సీపీఐ నేత డి. రాజా కూడా నిరసనల వేదికపై ఆంక్షలను తప్పుబట్టారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రజలకు నిరసన తెలిపే హక్కును కల్పించిందని గుర్తుచేశారు. ప్రజలు తమ సమస్యలపై ఆందోళన వ్యక్తం చేయడాన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై తమ అభ్యంతరాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని విపక్ష నేతలు స్పష్టం చేశారు.

సిరీస్‌పై భారత్ గురి!

నేడు ఉప్పల్‌లో భారత్--వెస్టిండీస్ నాలుగో టీ20
2-1 ఆధిక్యంతో బరిలోకి టీమ్‌ఇండియా
గెలిస్తే మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ సొంతం
సంజు శాంసన్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం
టాప్ ఆర్డర్‌పైనే భారీ అంచనాలు
కుల్దీప్ యాదవ్‌కు అవకాశం దక్కేనా?
బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉప్పల్ పిచ్
పరుగుల వర్షం కురుస్తుందా?



హైదరాబాద్

భారత్--వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కీలక దశకు చేరుకుంది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా నేడు నాలుగో టీ20 జరగనుంది. గత మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి వచ్చిన టీమ్‌ఇండియా.. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. మరోవైపు వెస్టిండీస్ ఈ మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేయాలని భావిస్తోంది. భారత జట్టులో ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజు శాంసన్ బరిలోకి దిగే అవకాశముంది. గత మ్యాచ్‌లో సంజు పెద్దగా రాణించకపోయినా, అంతకుముందు మ్యాచ్‌లో కీలక స్కోరు సాధించాడు. ఉప్పల్ మైదానంలో అతడికి ఉన్న అనుభవం కూడా కలిసిరావచ్చని భావిస్తున్నారు. దీంతో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి మరోసారి తుది జట్టులో చోటు దక్కకపోవచ్చని అంచనా. మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఐదో స్థానంలో తిలక్ వర్మ బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. వీరంతా రాణిస్తే భారత్ భారీ స్కోరు సాధించగలదని అభిమానులు ఆశిస్తున్నారు. ఆల్‌రౌండర్లుగా నమన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్ జట్టులో కొనసాగే అవకాశముంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ వీరు రాణించగలగడం జట్టుకు బలంగా మారనుంది. బౌలింగ్ విభాగంలోనూ మార్పులు జరిగే అవకాశం ఉంది. పెద్ద మైదానమైన ఉప్పల్‌లో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం కల్పిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అతడికి చోటు దక్కితే ప్రిన్స్ యాదవ్ బెంచ్‌కు పరిమితం కావచ్చు. అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్ పేస్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఉప్పల్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. వేగవంతమైన అవుట్‌ఫీల్డ్, బౌండరీల పరిస్థితుల కారణంగా భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశముంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉందని అంచనా. వాతావరణం అనుకూలిస్తే మ్యాచ్‌కు అంతరాయం కలగకపోవచ్చని భావిస్తున్నారు.
భారత్ అంచనా జట్టు: అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, ప్రిన్స్ యాదవ్/కుల్దీప్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్.
వెస్టిండీస్ అంచనా జట్టు: హోప్ (కెప్టెన్, వికెట్ కీపర్), కమిల్, హెట్‌మయర్, పావెల్, రూథర్‌ఫర్డ్, షెపర్డ్, చైజ్, స్ప్రింగర్, పాల్, జోసెఫ్, మోతీ.

సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు దసరా కానుక

మొదటి తరువాయి

ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 బోనస్ అందించామని, ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు.

సింగరేణి ఉద్యోగ, కార్మికులకు సొంతింటి కల సాకారం

"సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఎక్కువగా పెండింలో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తాం. సింగరేణి కార్మికులు సొంత ఇండ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసి దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించాం. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని" సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెల నిర్దిష్ట రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్చలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

రైతు డిస్కమ్ పేరుతో ఉచిత విద్యుత్తుకు ఎసరు!

మొదటి తరువాయి

పట్టించుకోకుండా రైతు డిస్కమ్ ఏర్పాటుకు జీవో 17 జారీ చేయడాన్ని ఆయన మంగళవారం 'ఎక్స్' వేదికగా ఖండించారు. జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కొత్త జీవో ప్రకారం వ్యవసాయ కనెక్షన్లతోపాటు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలోని కనెక్షన్లు కలిపి మొత్తం 30,62,853 కనెక్షన్లను రైతు డిస్కమ్‌కు బదిలీ చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఈ వ్యవస్థ కింద 6.15 లక్షల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, 2.51 లక్షల కిలోమీటర్ల ఎల్‌టీ విద్యుత్తు లైన్లు ఉన్నాయని వివరించారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2 వేల మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మార్చేందుకు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, భవిష్యత్తులో సమస్యలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్తులో 53.28 శాతం థర్మల్ విద్యుత్తు ఉన్నప్పటికీ, రైతు డిస్కమ్‌కు 25 శాతం మాత్రమే కేటాయించారని హరీశ్‌రావు పేర్కొన్నారు. పగటిపూట మాత్రమే అందుబాటులో ఉండే సౌర విద్యుత్తును 58 శాతం, ఏడాదిలో మూడు నుంచి నాలుగు నెలలే ఉత్పత్తయ్యే జలవిద్యుత్తును 100 శాతం కేటాయించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగిలిన ఎనిమిది నెలల్లో రైతులకు కరెంటు ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. ఈ విధానం వల్ల రైతులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని విమర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు నిత్యావసర సరుకులు సరఫరా చేసేందుకు తీసుకొచ్చిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను కూడా వెంటనే రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు కలిసి తమ సమస్యలను వివరించారు. కొత్త విధానం వల్ల వేలాది మంది స్థానిక చిన్న వ్యాపారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ నోట్‌బుక్‌ల కొనుగోళ్లలో రూ.2 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఇప్పుడు నిత్యావసర సరుకుల కొనుగోళ్లలోనూ 20 శాతం వరకు కమీషన్లు వసూలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రైతు డిస్కమ్ జీవోను వెనక్కి తీసుకోవడంతోపాటు పీఎంయూ టెండర్లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

పీఎంయూ టెండర్లు రద్దు చేయాలి





- మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 13. :


గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో సరుకుల సరఫరా కోసం తెచ్చిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి. గతంలో మాదిరిగానే పాఠశాలను ఒక యూనిట్‌గా తీసుకుని, డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ ద్వారా స్థానిక వెండర్లకే నిత్యావసర సరుకుల సరఫరా బాధ్యతలు అప్పగించాలి. పాత విధానాన్ని కొనసాగించడం ద్వారా జీవనోపాధి కోల్పోతున్న వేలమంది చిరు వ్యాపార కుటుంబాల భవిష్యత్తును కాపాడటంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన, తాజా సరుకులు అందుతాయి. ప్రభుత్వ పెద్దల కమీషన్ల కోసం బ్లాక్‌లిస్ట్ సంస్థకు టెండర్ కట్టబెట్టడం దుర్మార్గం. నిబంధనలకు విరుద్ధంగా సబ్ కాంట్రాక్టులు ఇస్తూ జిల్లాకు రూ. 2 కోట్ల చొప్పున రూ. 66 కోట్ల గుడ్‌విల్, బిల్లుల్లో ప్రతినెల 20 శాతం కమీషన్లు నొక్కేస్తూ పేద విద్యార్థుల కడుపు కొడుతున్నారు. లోకల్ వెండర్లు ఇచ్చే ధరల కంటే 35 నుంచి 45 శాతం అధిక ధరకు కాంట్రాక్ట్ ఖరారు చేసినా.. నేటికీ హాస్టళ్లకు సరుకులు ఇవ్వలేని చేతకానితనం కాంగ్రెస్ సర్కార్‌ది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టి మూడు నెలల్లోనే విఫలమై రద్దయిన విధానాన్ని.. ఎవరి స్వలాభం కోసం తెలంగాణలో రుద్దుతున్నారు? ప్రభుత్వం వెంటనే ఈ టెండర్లను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించకపోతే, బాధిత కుటుంబాలు, విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాడుతుంది.

రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నిత్యావసర సరుకుల సరఫరా కోసం ప్రభుత్వం చేపట్టిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు హరీశ్ రావును కలిసి, ప్రభుత్వం మార్చిన టెండర్ నిబంధనల వల్ల వేలమంది స్థానిక వెండర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను విన్న అనంతరం హరీశ్ రావు స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గురుకులాలను చిన్నచూపు చూస్తూ పేద విద్యార్థులకు పెట్టే భోజనంపై కూడా కక్కుర్తి పడుతూ, 800 కోట్ల టెండర్లలో కమీషన్ల దందా నడుపుతోందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. గురుకులాల్లో పేద విద్యార్థులకు ఇచ్చే స్కూల్ యూనిఫాంలు, నోట్ బుక్కులు, ట్రంక్ పెట్టెల ఇతర వస్తువుల కొనుగోళ్ల టెండర్లలో దాదాపు రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని గతంలోనే తాము ఆధారాలతో సహా నిరూపించామని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆ దోపిడీతో కూడా కాంగ్రెస్ పాలకుల కడుపు నిండలేదని.. ఇప్పుడు చివరకు పేద విద్యార్థుల కడుపునింపే నిత్యావసర సరుకులపైనా 20 శాతం కమీషన్లు దండుకోవాలని చూడడం వీరి కక్కుర్తికి నిదర్శనం అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,023 గురుకులాలు, 3 వేలకు పైగా సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో పాఠశాలను యూనిట్‌గా తీసుకుని స్థానిక వ్యాపారులు సరుకులు సరఫరా చేసేవారని గుర్తుచేశారు. అయితే స్థానిక వెండర్లను తప్పించేందుకు జీవో 17 పేరుతో మొదట జిల్లా యూనిట్ అని, ఆ తర్వాత రూ. 3 కోట్ల నుంచి రూ. 5 కోట్ల భారీ ఈఎండీలు పెట్టి వారిని పోటీ లేకుండా చేశారని ఆక్షేపించారు. వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించినా లెక్కచేయకుండా, ఇప్పుడు మొత్తం రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చేసి పీఎంయూ విధానం ద్వారా రూ. 800 కోట్ల కాంట్రాక్టును ఒకే వ్యక్తికి, అదీ గతంలో బ్లాక్‌లిస్టులో పెట్టిన సంస్థకు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు.

గతంలో నిబంధనల ఉల్లంఘన కారణంగా తెలంగాణ సివిల్ సప్లైస్‌లో రూ. 65 కోట్ల డిపాజిట్ జప్తునకు గురై బ్లాక్‌లిస్టులో ఉన్న నాకాఫ్ సంస్థకు, అలాగే ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో నిషేధానికి గురైన కంపెనీకి ఈ టెండర్‌ను ఎలా కట్టబెడతారని హరీశ్ రావు ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం సబ్-కాంట్రాక్టులకు తావులేకపోయినా.. తెరవెనుక 12 మందికి సబ్ కాంట్రాక్టులు, అక్కడి నుంచి 33 జిల్లాలకు పంపకాలు చేసి, ప్రతి జిల్లాకు రూ. 2 కోట్ల చొప్పున ఏకంగా రూ. 66 కోట్ల గుడ్‌విల్, ప్రతినెల బిల్లుల్లో 20 శాతం కమీషన్ల ఒప్పందం కుదుర్చుకున్నారని పత్రికా కథనాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. అమీర్‌పేటలోని ప్రైవేట్ కార్యాలయం కేంద్రంగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి చక్రం తిప్పుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు . గతంలో ఇదే కాంట్రాక్టర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సరిగ్గా ఇదే కేంద్రీకృత విధానాన్ని అమలు చేయాలని చూశారని హరీశ్ రావు గుర్తుచేశారు. అక్కడ మూడు నెలలు నడిపిన తర్వాత ఈ విధానం ఆచరణ సాధ్యం కాదని తేలడం, సదరు కాంట్రాక్టర్‌పై తీవ్ర ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో అక్కడి ప్రభుత్వమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ఆ టెండర్‌ను రద్దు చేసి, తిరిగి పాత పద్ధతిలోనే స్థానిక ప్రొక్యూర్మెంట్ విధానాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. పక్క రాష్ట్రంలో అట్టర్‌ఫ్లాప్ అయి, లోపభూయిష్టమని తేలి రద్దు చేసిన విధానాన్ని.. ఇప్పుడు ఎవరి స్వలాభం కోసం, ఎవరి జేబులు నింపడానికి తెలంగాణలో బలవంతంగా అమలు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ స్వార్థ ప్రయోజనాలు, కమీషన్ల కక్కుర్తి కోసం పేద విద్యార్థుల కడుపు ఎందుకు కొడతారని నిలదీశారు. స్థానిక వెండర్లు సప్లై చేసే సాధారణ రేట్ల కంటే 35 నుంచి 45 శాతం అధిక ధరలకు టెండర్లను ఖరారు చేశారని, ప్రభుత్వం నిర్ణయించిన డైట్ ఛార్జీల కంటే ఎక్కువ రేట్లకు కాంట్రాక్టు ఇస్తే భవిష్యత్తులో విద్యార్థులకు కడుపునిండా అన్నం పెట్టే పరిస్థితి ఎక్కడుంటుందని హరీశ్ రావు నిలదీశారు. జూన్ నెల నుంచే సరుకులు ఇవ్వాల్సిన సదరు సంస్థ ఇప్పటివరకు సరఫరా చేయలేకపోయిందని, హాస్టళ్ల ప్రిన్సిపాళ్లు పాత లోకల్ వెండర్లను బతిమిలాడి మూడు నెలలు సరుకులు తెప్పించుకున్నారని చెప్పారు. దసరా పండుగ సెలవులకు ముందు రాష్ట్రంలోని దాదాపు 4 వేల హాస్టళ్లలో కేవలం 280 కేంద్రాలకే నామమాత్రంగా సరుకులు పంపారని, అవి కూడా ఎలాంటి బ్రాండ్, బిల్లు, ఎక్స్‌పైరీ డేట్ లేని అత్యంత నాసిరకం వస్తువులని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వం వెంటనే మొండివైఖరి వీడి, కమీషన్ల కోసం తెచ్చిన ఈ కేంద్రీకృత పీఎంయూ టెండర్లను రద్దు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. గతంలో అమలులో ఉన్న విధంగా డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ ద్వారా, పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి స్థానిక వెండర్లకే నిత్యావసర సరుకుల సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. దీనిపై ఆధారపడి బతుకుతున్న వేలాది కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయని, అంతేకాకుండా స్థానికంగా జవాబుదారీతనం పెరిగి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఆరోగ్యం, చిరు వ్యాపారుల పొట్టకొట్టే ఈ అవినీతి నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, బాధిత కుటుంబాల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

పాలకుల నిర్లక్ష్యం పై త్వరలో పాత్రికేయుల పోరుబాట

-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య







హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 13:

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో మాట తప్పిన పాలకుల వైఖరి పై త్వరలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ చేపడతామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ లోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు, టీజేయు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఏటీ రాజారావు, కే. రాజశేఖర్ యాదవ్ లతో పాటు పలువురు స్థానిక జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. ఈ సందర్భంగా వీరికి రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సభ్యత్వం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని అన్నారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారని, అక్రెడిటేషన్ కార్డుల పంపిణి వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని, జర్నలిస్టుల ఆరోగ్య సమస్య, సామాజిక భద్రతలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందు పడుతున్నారని, ఇంటి జాగల కోసం ఎదురు చూసి ఎంతోమంది జర్నలిస్టులు చనిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక అనేక చిన్న, మధ్యతరహా పత్రికలు, కేబుల్ ఛానళ్ళు మూతపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై త్వరలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ ఉంటుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ కు జర్నలిస్టులంతా అండగా ఉండాలని, జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. సంగారెడ్డి జిల్లాలో త్వరలో నూతన నాయకత్వంలో మహాసభ జరుగుతుందని తెలిపారు.

దేవి నవరాత్రి ఉత్సవాలకు 25 కిలోల బియ్యం విరాళం

జై హనుమాన్ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



దుబ్బాక ప్రతినిధి (వార్తసంధ్య)అక్టోబర్ 13:

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చీకోడు గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు జై హనుమాన్ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ఈ విరాళాన్ని సమర్పించారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తోడ్పాటునందిస్తూ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పున్న శివశంకర్, కాసారం కృష్ణ, దేవరాజు మాట్లాడుతూ ఉత్సవాలకు బియ్యం విరాళంగా అందించిన జై హనుమాన్ ట్రాక్టర్ యూనియన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామంలో ఐక్యత, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జై హనుమాన్ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షులు సలిమేడ స్వామి, ఉపాధ్యక్షులు మొగిలి సత్యం, కోశాధికారి ఎం.డి. ఫారూక్, సభ్యులు శేఖర్, ఎల్లయ్య, నర్సిములు, రామస్వామి, ఎల్లం, కనకరాజు, రాములు, రాజు, లింగారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

17 ఏళ్లుగా మాతృభూమి సేవలో.. సైనికుడు దశరథ్ గర్వభరిత ప్రస్థానం!

-త్యాగాలు, కష్టాలు, ఎన్నో అనుభవాల మధ్య దేశసేవలో ముందడుగు

-కుటుంబ సభ్యులు, మిత్రులు, సీనియర్ల సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 13 (వార్త సంధ్య)

భారత సైన్యంలో చేరి 17 ఏళ్లుగా మాతృభూమి సేవలో కొనసాగుతున్న సైనికుడు దశరథ్ తన సుదీర్ఘ సైనిక ప్రస్థానంలోని అనుభవాలను భావోద్వేగంగా పంచుకున్నారు. దేశానికి సేవ చేయడం తన అదృష్టంగా, జీవితంలో లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు.

త్యాగాలు.. కష్టాలు.. మరువలేని జ్ఞాపకాలు

17 ఏళ్ల సైనిక జీవితం కేవలం సంవత్సరాల లెక్క మాత్రమే కాదని, ఎన్నో త్యాగాలు, కష్టాలు, బాధ్యతలు, మధురమైన జ్ఞాపకాలు, మరువలేని అనుభవాల సమాహారమని దశరథ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహించడం వెనుక ఎన్నో భావోద్వేగాలు, త్యాగాలు దాగి ఉంటాయని వివరించారు. భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, సొంత ఊరికి దూరంగా విధులు నిర్వహించే క్రమంలో ఎన్నో పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోలేకపోయానని గుర్తుచేసుకున్నారు. మనసులో బాధ ఉన్నప్పటికీ దేశ రక్షణ బాధ్యతలను నిర్వర్తించడమే తన కర్తవ్యమని భావించి ముందుకు సాగినట్లు తెలిపారు. నిద్రలేని రాత్రులు, ఒంటరిగా గడిపిన క్షణాలు సైనిక జీవితంలో భాగమయ్యాయని భావోద్వేగంగా పేర్కొన్నారు.



కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది

తన సుదీర్ఘ సైనిక ప్రస్థానంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం, తన శ్రీమతి అందించిన సహకారం, మిత్రుల అండదండలు, సీనియర్ల మార్గదర్శకత్వం ఎంతో కీలక పాత్ర పోషించాయని దశరథ్ తెలిపారు. ప్రతి అడుగులోనూ భగవంతుడి ఆశీస్సులు తనకు అండగా నిలిచాయని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. తనకు జన్మనిచ్చి మంచి మార్గంలో నడిపించిన తల్లిదండ్రులకు, ప్రతి కష్టసుఖంలో తోడుగా నిలిచిన భార్యకు, మిత్రులకు, సీనియర్లకు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రేమ, ప్రోత్సాహం, ఆశీస్సులే తనకు కొండంత బలమని, వారి సహకారమే తన ప్రయాణానికి పునాది అని పేర్కొన్నారు.

దేశసేవే గర్వకారణం

"నా దేశం నా గర్వం.. నా సైనిక జీవితం నా అదృష్టం.. మాతృభూమి సేవలో గడిపిన ప్రతి క్షణం నా జీవితంలో గర్వించదగినది" అని దశరథ్ భావోద్వేగంగా పేర్కొన్నారు. దేశసేవ పట్ల మరింత అంకితభావంతో ముందుకు సాగుతానని, తన ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. 17 ఏళ్ల సైనిక ప్రస్థానం ద్వారా దేశ రక్షణ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్న దశరథ్ ప్రయాణం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

లలిత కళా తోరణంలో నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ వేడుకలు:



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 13,

తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకల్లో భాగంగా నాలుగో రోజు హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న లలిత కళా తోరణంలో "నానబియ్యం బతుకమ్మ" వేడుకలను నిర్వహించారు.ఈ వేడుకల్లో తెలంగాణ సమృద్ధమైన పుష్ప, సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించింది. మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భక్తి, ప్రకృతి ప్రేమ, సామాజిక ఐక్యత స్ఫూర్తిని ప్రతిబింబించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని ఉత్సవ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించి, ప్రోత్సహించడంతో పాటు, వాటిని రాష్ట్ర పర్యాటక అనుభవంలో అంతర్భాగంగా ప్రదర్శించేందుకు పర్యాటక శాఖ 2026 అక్టోబర్ 10 నుంచి 18 వరకు ఈ వేడుకలను నిర్వహిస్తోంది.

గ్రామ పంచాయతీ కార్మికులకు బట్టల పంపిణి

నారాయణఖేడ్ (వార్త సంధ్య)అక్టోబర్ 13,

నారాయణఖేడ్ మండలంలోని రుద్రారం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులకు ఆత్మకమిటి చైర్మన్ వినోద్ పాటిల్ చేతుల మీదుగా బట్టలను పంపిణి చేశారు.లయన్స్ క్లబ్ సౌజన్యంతో బట్టలను పంపిణి చేసిన కార్యక్రమంలో వెంకట్ రావు,సామెల్,గ్రామ సర్పంచ్ పూలమ్మ సామెల్,జనార్దన్,వార్డు సభ్యులు నల్ల వల్లి శ్రీనివాస్,తెనుగు యాదు,వినోద్ గౌడ్,విఠల్,ఇంద్రసేన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వార్తసంధ్య
www.vaarthasandhya.com

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

-లేదంటే ఢిల్లీలో ఆందోళనలను ఉధృతం చేస్తాం
-ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి
-రాహుల్‌గాంధీ పిలుపుతో జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ ధర్నా
-సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొనడం
-ఓటు హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం
-తెలంగాణలోనూ నిరసనలు, ర్యాలీలు చేపడతామని హెచ్చరిక
-మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సయ్యద్ ఫసి హుస్సేన్ డిమాండ్
-ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య), అక్టోబర్ 13

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సయ్యద్ ఫసి హుస్సేన్ డిమాండ్ చేశారు. లేదంటే ఢిల్లీలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కుల పరిరక్షణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ నేతలు తమ నిరసన వ్యక్తం చేశారు. జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని సయ్యద్ ఫసి హుస్సేన్ కోరారు. డిమాండ్లపై స్పందించకపోతే తెలంగాణలోనూ ధర్నాలు, ర్యాలీలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, క్రాంతి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న జయంతిని విజయవంతం చేయాలి



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 13

సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగ సాయన్న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ నెల 22వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న పండుగ సాయన్న ముదిరాజ్ 174వ అధికారిక జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో జగన్ ముదిరాజ్ మాట్లాడుతూ పండుగ సాయన్న జయంతిని విజయవంతం చేయాలని కోరారు బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చైర్మన్, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఁ పండుగ సాయన్న ఉత్సవ కమిటీ. ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్ అనిత ముదిరాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు

ప్రమాదంలో గాయపడిన సర్పంచ్ దంపతులకు సర్పంచుల సంఘం అండ

-పాటిమీదగుంపు సర్పంచ్ గుగులోత్ సుజాత--సంతోష్ దంపతులకు పరామర్శ
-వీడియో కాల్‌లో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



సింగరేణి ప్రతినిధి , అక్టోబర్ 13 (వార్త సంధ్య)

రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాటిమీదగుంపు గ్రామ సర్పంచ్ గుగులోత్ సుజాత, ఆమె భర్త సంతోష్‌లను సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, గాదెపాడు గ్రామ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలువురు సర్పంచులు పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. సర్పంచ్ దంపతులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వీడియో కాల్‌లో పరామర్శించిన ఎమ్మెల్యే


ఇదే సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ వీడియో కాల్ ద్వారా సర్పంచ్ గుగులోత్ సుజాత, ఆమె భర్త సంతోష్‌ల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే స్వయంగా వచ్చి పరామర్శిస్తానని తెలిపి, వారికి ధైర్యం చెప్పారు. ప్రమాదానికి గురైన సర్పంచ్ దంపతులకు మండలంలోని సర్పంచులంతా అండగా నిలవాలని సూచించారు.

పరామర్శించిన వారిలో పలువురు సర్పంచులు

ఈ కార్యక్రమంలో సర్పంచులు బానోత్ రాందాస్ నాయక్, మోతి వీరస్వామి, బానోత్ పద్మ వీరభద్రు, పూసం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రమాదంలో గాయపడిన తమ తోటి ప్రజాప్రతినిధి కుటుంబానికి అండగా నిలవడం ద్వారా సర్పంచుల మధ్య ఐక్యతను చాటుకున్నారు.

గిరిజన ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్‌పై ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతి

-భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని విజ్ఞప్తి
-ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ



సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 13 (వార్త సంధ్య)

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఈఏటీఎస్) నాయకులు కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రభుత్వ హామీల కమిటీ సభ్యులు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు.

దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి

ఈ సందర్భంగా టీఈఏటీఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూకర రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ ప్రతాప్ సింగ్ ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ అంశంపై చర్చించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించి, ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు

ఉపాధ్యాయుల వినతిపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సానుకూలంగా స్పందించారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (ప్రిన్సిపల్ సెక్రటరీ), గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌తో ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చిస్తానని తెలిపారు. అప్‌గ్రేడేషన్ ప్రక్రియ ముందుకు సాగేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుల్లో ఆశాభావం

అప్‌గ్రేడేషన్ సమస్య పరిష్కారమైతే దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందని అసోసియేషన్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

హైమాస్ట్ పెట్టిండ్రు.. లైట్లు వెలిగించడం మరిచిండ్రా?!

-మునుగోడు--చిట్యాల రోడ్డులో చీకట్లలోనే జంక్షన్.. అధికారుల దృష్టి పడేదెప్పుడో!



మునుగోడు అక్టోబర్ 13 (వార్త సంధ్య)

మునుగోడు--చిట్యాల రోడ్డులో బ్రిడ్జిపై మూడు రోడ్లు కలిసే జంక్షన్ దగ్గర హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేసిండ్రు.. కానీ లైట్లు మాత్రం వెలగడం లేదు! స్తంభం నిటారుగా నిలబడింది.. లైట్లు మాత్రం చీకటితోనే దోస్తీ చేస్తున్నాయి. రాత్రిపూట ఆ దారిన పోయే వాహనదారులకు వెలుగు చూపించాల్సిన లైట్లు ఇలా అలంకారప్రాయంగా మిగిలిపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లైట్లు పెట్టడం ఒక్కటే సరిపోతుందా.. వెలిగించడం కూడా చూసుకోవాలిగా! సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి, జంక్షన్‌లో వెలుగులు నింపాలని ప్రజలు కోరుతున్నారు.

దసరా పండుగ కానుకగా గ్రామపంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ

-గుడిపల్లి గ్రామంలో ఘనంగా దసరా కానుకల పంపిణీ కార్యక్రమం



గుడిపల్లి, అక్టోబర్ 13 (వార్త సంధ్య)

గుడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పది మంది వార్డు సభ్యులు, ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బందికి దసరా పండుగను పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ కూన్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి నూతన వస్త్రాలను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూన్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. “అందరూ బాగుండాలి.. అందరితో నేను ఉండాలి” అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, పంచాయతీ సిబ్బందిని గౌరవిస్తూ, దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గ్రామ కార్యదర్శి విజయ్ రెడ్డి, ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య, వార్డు సభ్యులు ఎర్ర మహేశ్వరి, కత్తుల రమేష్, గోలి స్వామి, దారం సైదమ్మ, బోడ నాగరాజు, ఎర్ర వంశీకృష్ణ, గణపురం రాధిక, వట్టేపు శ్రీను, వడ్లపల్లి శ్రావణ్య పాల్గొన్నారు. అలాగే గ్రామపంచాయతీ సిబ్బంది గోలి ఈశ్వర్, వడ్లపల్లి వెంకటరెడ్డి, భూతం యాదయ్య, కొమ్ము దుర్గయ్య, ఎర్ర వెంకటయ్య, బోడ వెంకటయ్య, గణపురం ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ తల్లి ప్రత్యేక పూజలు



వార్త సంధ్య కూకట్‌పల్లి :

దసరా నవరాత్రుల శుభసందర్భంగా శంషిగూడ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ ఫేస్-2 లో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన (అన్నప్రసాద వితరణ) కార్యక్రమాన్ని వెంకటేష్ గౌడ్ స్వహస్తాలతో ప్రారంభించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుర్గామాత దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే నియోజకవర్గ ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొల్లంగి భాస్కర్, పోశెట్టి గౌడ్, కాశినాథ్ యాదవ్, భాస్కర్, వెంకటేష్, హరీష్, సిద్దయ్య, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, శ్రీను, రాజు, శ్రీధర్, శ్రీనివాస్, దత్తాత్రేయ కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో ఘనంగా దసరా నవరాత్రి వేడుకలు



వార్త సంధ్య కూకట్‌పల్లి

నియోజకవర్గం, కైతలాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన దసరా నవరాత్రి వేడుకల్లో జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ శ్రీ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినోద్ కుమార్ గారి ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.
ఈ సందర్భంగా శ్రీ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ.. విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొల్లా శంకర్, వేముల మహేష్ రావుతో పాటు స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


బతుకమ్మ కుంట మెట్ల నిర్మాణ పనుల పరిశీలన



నారాయణఖేడ్, అక్టోబర్ 13 (వార్త సంధ్య)

నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని 7వ వార్డులో గల బతుకమ్మకుంట వద్ద ఏర్పాటు చేస్తున్న సిసి రోడ్డు మరియు మెట్ల నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి,మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్,కౌన్సిలర్ విజయ్ బుజ్జి లు పరిశీలించారు.బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులు ఆటపాటల అనంతరం బతుకమ్మలను నీటిలో వదలడానికి సౌకర్యంగా ఉండడానికి రోడ్డు, మెట్ల నిర్మాణం చేపట్టినట్లు వారు తెలిపారు.వారితో పాటు నాయకులు గోపాల్ రెడ్డి ఉన్నారు

ఎల్ ఓ సి చెక్కు అందజేసిన మాజీ ఎమ్మెల్యే




నారాయణఖేడ్, అక్టోబర్ 13 (వార్త సంధ్య)

కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన రెహానాకు ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన 2 లక్షల రూపాయల ఎల్ ఓ సి చెక్కును మంగళవారం నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి లబ్దిదారులకు అందజేశారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం

దేశానికే దిక్సూచిగా కేసీఆర్ పాలన



కరువు, వలసలతో అల్లాడిన తెలంగాణ వ్యవసాయాన్ని 'పండుగ'గా మార్చడం కేసీఆర్ ప్రభుత్వ ఘనవిజయం. పూడికలతో నిండిన చెరువులకు మిషన్ కాకతీయ ద్వారా పునర్జీవం పోసి, గ్రామీణ జలవనరులను పునరుద్ధరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను విస్తృత ప్రాంతాలకు తరలించి, బీడుభూములను సస్యశ్యామలం చేశారు. ఈ చర్యల ఫలితంగా సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. ధాన్యోత్పత్తి కూడా బహుళ రెట్లు అభివృద్ధి చెందింది. రైతుబంధు ద్వారా ఎకరానికి, ఏడాదికి రూ.10 వేల పెట్టుబడి సాయం, రైతు బీమా ద్వారా రూ.5 లక్షల ఆర్థిక భద్రత, 24 గంటల ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతు వేదికల నిర్మాణం రైతులకు పూర్తి మద్దతునిచ్చాయి.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన

పాలన ప్రజల ముంగిట ఉండాలనే సూత్రంతో పరిపాలనా వికేంద్రీకరణ జరిగింది. ప్రాజెక్టులు, భౌగోళిక పరిస్థితులు, ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచి 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్విభజన చేశారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు, పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేయడం ద్వారా అధికారులు ప్రజలకు దగ్గరయ్యారు. గిరిజన ప్రాంతాల్లోని తండాలు, గూడేలకు ప్రత్యేక గ్రామ పంచాయతీ హోదా ఇవ్వడం ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, పల్లె ప్రగతి ద్వారా పరిశుభ్రత, పచ్చదనం, స్మశానవాటికలు, చెత్త నిర్వహణ వంటి సౌకర్యాలు గ్రామీణ జీవన నాణ్యతను మెరుగుపరిచాయి.

విద్యా, వైద్యరంగంలో విప్లవం

పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు గురుకుల విద్యా సంస్థలు విస్తరించాయి. 'మన ఊరుమన బడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు కల్పించారు. జూనియర్, డిగ్రీ కళాశాలల ఆధునీకరణతో గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది. వైద్యారోగ్య రంగంలో జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. దవాఖానలు, మౌలిక సదుపాయాలు విస్తరించాయి. పడకల సంఖ్య, ఐసీయూలు, డయాలసిస్ కేంద్రాలు, బస్తీ దవాఖానాలు పెరగడంతో పేదలకు స్థానికంగానే నాణ్యమైన చికిత్స అందే విధంగా మారింది. టిమ్స్ నిర్మాణం, నిమ్స్ విస్తరణతో హైదరాబాద్ మెడికల్ హబ్‌గా ప్రసిద్ధి చెందింది.

విద్యుత్తు, పారిశ్రామిక పురోగతి

రాష్ట్ర ఏర్పాటు సమయంలో విద్యుత్తు కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ, స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రణాళికలు, పట్టుదలతో ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి దాదాపు 20 వేల మెగావాట్లకు పెంచారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్తు అందించి, పరిశ్రమలకు అవసరమైన నాణ్యమైన కరెంటును సరఫరా చేశారు. టీఎస్-ఐపాస్ విధానం ద్వారా పరిశ్రమల అనుమతులకు పారదర్శక విధానం తీసుకొచ్చారు. నిర్దిష్ట కాలపరిమితితో అనుమతులు జారీ చేసే పాలసీని అమలు చేశారు. దీంతో కొత్త పెట్టుబడులను ఆకర్షించి, లక్షలాది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు సృష్టించారు.

సంక్షేమం, ఆర్థిక వృద్ధి

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, దళితబంధు, గొర్రెల పంపిణీ, మత్స్యకార సంక్షేమం వంటి పథకాలు సమాజంలోని అన్ని వర్గాలకు భద్రత కల్పించాయి. ఫలితంగా 2014-15లో రూ.5.06 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్డీపీ 2022-23 నాటికి రూ.13.13 లక్షల కోట్లకు పెరిగింది. తలసరి ఆదాయం రూ.3,12,398గా నమోదై, జాతీయ సగటు రూ.1,72,276ను అధిగమించింది. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనా కాలంలో సాధించిన ఈ బహుముఖ ప్రగతి కేవలం మౌలిక సదుపాయాల విస్తరణే కాదు, ప్రజల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం. కేసీఆర్ దార్శనిక నాయకత్వం తెలంగాణను దేశానికే అభివృద్ధి దిక్సూచిగా నిలబెట్టింది.

పబ్లిసిటీకి తప్ప ఎందుకూ పనికిరానిది!



ప్రధాని మోదీ ప్రచార ప్రణాళికలో ఒక పార్శ్వం దేశీయమైతే మరొకటి అంతర్జాతీయం. తన ప్రచారదుగ్ధలో భాగంగా 'విశ్వగురు' అనే మాటను కూడా తమ మొదటి ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారు. తన కోసం తన వందిమాగధులతో ఆ బిరుదు ఇప్పించుకున్నారు. ఏ దేశానికి పోయినా అక్కడి అత్యున్నత పౌరసత్కారాలు, పతకాలను మరే దేశాధినేత చేయని విధంగా ఇప్పించుకోవటం ఒక సంప్రదాయంగా మార్చుకున్నారని అంతర్జాతీయ మీడియా ఇటీవలనే కథనాలు రాసింది. హడావుడిగా తయారు చేయించటం వల్ల ఆ పతకాలూ పత్రాల్లో కొన్ని సందర్భాల్లో దొర్లిన తప్పులను కూడా ఎత్తిచూపింది. ప్రధాని మోదీ పబ్లిసిటీ కాంక్షకు ఇటువంటివన్నీ దృష్టాంతాలవుతున్నాయి. అటువంటి కోవలోకి వచ్చేదే రష్యా-ఉక్రెయిన్ శాంతిసూత్రం సంగతి. అయితే ఆయన అధికారులు ఒక జాగ్రత్త తీసుకున్నారు. మోదీ సూత్రాలు అసలు యుద్ధ పరిష్కారానికి అనిగాక, యుద్ధం వల్ల తలెత్తిన తక్షణ సమస్యల నివారణకు అని పేర్కొన్నారు. ఇంతకూ ఆ సూత్రాలు ఏమిటి? ఒకటి, రెండు దేశాలు కూడా అవతలి పక్షపు మౌలిక సదుపాయాలపై దాడులు ఆపటం. రెండు, నిత్యావసరాల సరఫరాలకు ఆటంకం కలిగించకపోవటం. మూడు, నల్ల సముద్రం మీదుగా వాణిజ్య నౌకల రాకపోకలకు రక్షణ కల్పించటం. వాస్తవానికి వీటిలో ఏ ఒక్కటీ మోదీ ప్రభుత్వం కొత్తగా చేసిన ప్రతిపాదన కాదు. ఐక్యరాజ్య సమితి సహా వేర్వేరు వైపుల నుంచి లోగడ వచ్చినవే. వేర్వేరు పక్షాలు తరచు పునశ్చరిస్తున్నవే. ఈ మాట మోదీ విదేశాంగశాఖకు తెలియదనుకోలేము. అంతేకాదు. దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, లేనట్టయితే అనేక దేశాలకు ఆహార ధాన్యం, ఎరువుల రవాణాలో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని ఐక్యరాజ్య సమితి, అమెరికా, ఆఫ్రికన్ దేశాలు చేసిన విజ్ఞప్తి దరిమిలా కొద్ది వారాలపాటు ఉభయపక్షాలు కొన్ని సడలింపులను ఇచ్చాయి కూడా. తర్వాత వెనుకటి పరిస్థితే ఏర్పడింది. ఇటువంటి నేపథ్యమంతా ఉన్నందున ఈ తరహా శాంతి పథకాలను ముందుకు తేవటాన్ని మిగిలిన వారు మరచిపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి మోదీ ప్రభుత్వానికి గుర్తుకువచ్చింది. అందుకు కారణం పైన అనుకున్నట్టు ప్రస్తుతం భారతదేశంలో సాగుతున్న అశాంతి అనుకుంటే పొరపాటు ఉండకపోవచ్చు. కానీ ఈ ఎత్తుగడ పారగల అవకాశం లేదు. స్వదేశంలోని అశాంతి తీవ్రంగా మారుతున్నది. అందుకే కావచ్చు ఈ యుద్ధశాంతి వార్తలను మోదీ అనుకూల పత్రికలు కూడా సీరియస్‌గా తీసుకోలేదు. శాంతి నెలకొనాలని, ఆ ప్రాంతం నుంచి సరఫరాలు సవ్యంగా సాగాలని కోరుకోవటంలో తప్పుపట్టవలసిందేమీ లేదు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్యగల నల్ల సముద్రం కీలకమైనది. రష్యా నుంచి చమురు తదితరాలు, ధాన్యం ఆ సముద్రం మీదుగా నిరంతరం రవాణా అవుతుండేవి. 2022 నుంచి సాగుతున్న యుద్ధం కారణంగా ముఖ్యంగా ఉక్రెయిన్ నుంచి ఈ రవాణాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సముద్రం మధ్యలో గల క్రిమియా దీవిని రష్యా ప్రస్తుత యుద్ధానికి ముందే 2014లో ఆక్రమించటం ఉక్రెయిన్‌కు మరింత సమస్య అయింది. ఈ పరిణామాల వల్ల సమస్యలను ఎదుర్కొంటున్న దేశాల్లో ఇండియా ఒకటి. కనుక, అసలు ఆ యుద్ధం ముగియాలని, లేదా కనీసం సరుకుల రవాణా సజావుగా సాగాలని కోరుకోవటం సహజం. ఇక్కడ సమస్య ఆ కోరికతో కాదు. కానీ, ఆ యుద్ధం ఎంత సంక్లిష్టమైనదో, రవాణా స్తంభనలు ఆ వ్యూహంలో ఎట్లా విడదీయరాని భాగంగా మారాయో తెలిసి కూడా ఇప్పుడు ఈ ప్రతిపాదనల కపటత్వమన్నది విమర్శించదగిన విషయమవుతున్నది. మరొకటి కూడా ఉన్నది. అది మరింత ముఖ్యమైనది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధమంటూ మొదలు కావటానికి కొన్ని మూల కారణాలున్నాయి. అవి తరచు చర్చకు వస్తున్నవే. సోవియెట్ యూనియన్, వార్సా సైనిక కూటమి 1991లో రద్దయిన తర్వాత, అమెరికా నాయకత్వాన ఉండిన నాటో సైనిక కూటమిని రద్దు చేయకపోవటమే గాక, ఆ కూటమిలోకి కొత్త దేశాలను చేర్చుకుంటూ రష్యా సరిహద్దుల వైపు విస్తరించటం మొదలుపెట్టారు. నాటో విస్తరణ ఉండదంటూ ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేదు. ఆ విధంగా విస్తరణలో ఉక్రెయిన్ వంతు వచ్చింది. అనగా రష్యాను పశ్చిమ దిశలో దిగ్బంధం చేయడమన్నమాట. అది తగదన్న రష్యా మాటను అమెరికా, యూరప్‌లు లెక్క చేయలేదు. ప్రధానంగా ఈ కారణం వల్లనే రష్యా ఆత్మరక్షణ కోసం 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను స్వాధీనపరచుకున్న తర్వాత, 2022లో ఉక్రెయిన్‌పై దాడిని మొదలుపెట్టింది. ఈ వరుస క్రమాన్ని నిరుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం గుర్తించి మాట్లాడటం గమనించదగ్గది. భారత ప్రధాని ఈ మౌలిక విషయాలను గుర్తించకుండా, అందుకు పరిష్కారాలను చర్చించకుండా, పైపైన మెరుగుమాటలు మాట్లాడటం వల్ల ఉపయోగమేమిటి? తనకు ఎవరూ నమ్మని పబ్లిసిటీ తప్ప. పైగా ఇవన్నీ గతంలోనూ ఇతరుల ద్వారా ప్రతిపాదనకు వచ్చి విఫలమైనప్పుడు? సమస్య పరిష్కారానికి రష్యా ప్రతిపాదనలు ఏమిటి? ఉక్రెయిన్ కోరుకుంటే యూరోపియన్ యూనియన్‌లో చేరవచ్చు గానీ, నాటోలో చేరబోమని ప్రకటించాలి. ఆ మేరకు తమ రాజ్యాంగాన్ని సవరించాలి. వారిని చేర్చుకొనబోమని నాటో కూడా ప్రకటించాలి. ఉక్రెయిన్ తూర్పున రష్యా సరిహద్దుల్లో గల దోన్‌బాస్ ప్రాంతంలో అధిక సంఖ్యాకులైన రష్యన్ జాతీయులపై వివక్షలను ఆపివేసి, వారికి సముచిత స్థానాలు కల్పించాలి. భవిష్యత్తులో తమ రక్షణ కోసం దోన్‌బాస్ ప్రాంతాన్ని తమకు బఫర్‌జోన్‌గా వదలాలి. ఇవి ప్రధానం. ఇందులో గమనించవలసింది దోన్‌బాస్ ఇప్పటికే సుమారు 80 శాతం గత నాలుగేండ్ల యుద్ధంలో రష్యా ఆధీనంలోకి వెళ్లిపోయింది. తక్కినది కూడా వదలుకుని రాజీ చేసుకోవాలని స్వయంగా ట్రంప్ ఒకటికి నాలుగుసార్లు ఉక్రెయిన్ ప్రధాని జెలెన్‌స్కీకి సూచించారు. అదేమాట ఈ నెల 10న కూడా అన్నారు. ఒక దశలో జెలెన్‌స్కీ సైతం అర్ధాంగీకారం తెలిపారు. తాము కూడా అదేమాట అన్న యూరోపియన్ నాయకులు అంతలోనే మాట మా ర్చారు. యుద్ధానికి సాయపడుతున్నారు. ఆ విధంగా యుద్ధానికి లోతైన నేపథ్య కారణాలుండగా, ఆ సమస్య పరిష్కారానికి చిక్కుముళ్లు అనేకం ఉన్నాయి. అవి తేలనంతవరకు నల్ల సముద్ర ప్రాంతంలో, ఇతరత్రా కూడా ఉభయపక్షాల మధ్య యుద్ధం సాగుతూనే ఉంటుంది. సరకుల రవాణాకు ఆటంకాలు కల్పించటం కూడా యుద్ధ వ్యూహంలో భాగమే. అది ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహం. అటువంటి స్థితిలో మీరు ఆ వ్యూహాన్ని మానుకుని మాకు మాత్రం సరకుల రవాణా జరిగేటట్టు చూడమంటూ చెప్పే శాంతిసూత్రాలు నెరవేరేవేనా? అవి సొంత పబ్లిసిటీకి తప్ప ఎందుకూ ఉపయోగపడవు. ఇది ఇరాన్ యుద్ధంలో, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల యుద్ధం గురించి ఏమీ మాట్లాడకుండా, హోర్ముజ్‌ను తెరవండి అంటూ ఇరాన్‌కు ప్రతిపాదించటం వంటిదే. మోదీ విశ్వగురుత్వం ఎంత అర్థరహితమైనదో అనేక ఇతర దృష్టాంతాలతోపాటు ఇది కూడా చెప్తున్నది.

కరవుపై కార్యాచరణ ఏదీ?

ఆకాశం కరుణించకపోతే రైతు పొలంలో పచ్చదనం క్రమంగా మాయమవుతుంది. బావుల్లో నీరు తగ్గుతుంది. చెరువులు వెలవెలబోతాయి. పంట కోసం చేసిన అప్పులు మాత్రం అలాగే ఉంటాయి. వర్షం కోసం ఎదురుచూసే రైతుకు ప్రతి రోజు భారంగా మారుతుంది. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగానికే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ఎల్‌నినో అనేది భూమధ్యరేఖ సమీపంలోని పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరగడంతో ఏర్పడే సహజ వాతావరణ దృగ్విషయం. ఇది ప్రపంచవ్యాప్తంగా గాలుల గమనాన్ని, వర్షపాతం పంపిణీని, ఉష్ణోగ్రతలను ప్రభావితం చేయగలదు. కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం, మరికొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు సంభవించే అవకాశాలను పెంచుతుంది. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాలను ఉటంకిస్తూ అక్టోబర్ 8న రాయిటర్స్ ప్రచురించిన నివేదిక ప్రకారం, ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితి మరింత బలపడి 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు అధిక అవకాశం ఉంది. ఇది గత దశాబ్దాల బలమైన ఎల్‌నినో పరిస్థితుల్లో ఒకటిగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఎల్‌నినో ఉందంటే తెలంగాణలో తప్పనిసరిగా కరువు వస్తుందని చెప్పలేం. రాష్ట్రంలో వర్షాలు ఎప్పుడు, ఎక్కడ, ఎంత మేరకు కురుస్తాయి అన్నది స్థానిక వాతావరణ పరిస్థితులు, వర్షాల విస్తరణ, నేల తేమ, నీటి నిల్వలపై కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే వాతావరణ హెచ్చరికలను భయాందోళనలకు కారణంగా కాకుండా ముందస్తు ప్రణాళికకు మార్గదర్శకంగా తీసుకోవాలి. ఎండలు తీవ్రమయ్యాక, బావులు ఎండిపోయాక, పంటలు ఎండిపోవడం మొదలయ్యాక స్పందించడం కంటే ముందుగానే నీటి వినియోగం, పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ సాగు, రైతుల ఆర్థిక రక్షణపై చర్యలు తీసుకోవడం మేలు. వర్షాభావ పరిస్థితుల్లో నీటి నిర్వహణ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన పరీక్ష. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరా పరిస్థితిని ముందుగానే అంచనా వేసి, అవసరమైతే ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేయాలి. బోర్లు, చేతిపంపులు, నీటి ట్యాంకులు, పైపులైన్ల పనితీరును పరిశీలించాలి. నీటి నాణ్యతను పరీక్షించాలి. ట్యాంకర్ల ద్వారా సరఫరా అవసరమయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి. సాగునీటి విషయంలో కూడా శాస్త్రీయ ప్రణాళిక అవసరం. జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తులో అందే



ప్రవాహాలు, తాగునీటి అవసరాలు, పంటల ప్రస్తుత దశలను పరిగణనలోకి తీసుకుని నీటి విడుదలపై నిర్ణయాలు తీసుకోవాలి. రైతులకు నీటి విడుదలపై ముందస్తు సమాచారం ఇవ్వాలి. నీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో అధిక నీరు అవసరమయ్యే పంటలపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయాలపై వ్యవసాయ నిపుణుల సలహాలు అందించాలి. వర్షపు నీటిని నిల్వ చేసే చెరువులు, కుంటలు, పాత నీటి వనరులను పునరుద్ధరించడం తాత్కాలిక చర్య మాత్రమే కాదు; దీర్ఘకాలిక నీటి భద్రతకు కూడా పునాది. అయితే ప్రతి ప్రాంతానికి ఒకే పరిష్కారం సరిపోదు. భూగర్భజలాల స్థితి, నేల స్వభావం, స్థానిక వర్షపాతం, సాగు పద్ధతులను బట్టి ప్రణాళిక రూపొందించాలి. నీటి కొరత ఏర్పడినప్పుడు రైతులు బోర్లపై ఆధారపడే అవకాశం పెరుగుతుంది. దీంతో మోటార్ల వినియోగం, విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతాయి. ఒకవైపు వ్యవసాయానికి విద్యుత్ అవసరం, మరోవైపు గృహాలు, పరిశ్రమలు, తాగునీటి పథకాలకు సరఫరా కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి సరఫరా ప్రణాళిక సిద్ధం చేయాలి. విద్యుత్ కొనుగోలు అవసరాలు, సరఫరా వ్యవస్థ సామర్థ్యం, అత్యవసర మరమ్మతులపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలి. విద్యుత్ ఆదా చేయాలనే పిలుపు ఇవ్వడం అవసరమే అయినప్పటికీ, దాని భారం రైతులపైనే పడకుండా చూడాలి.వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన సరఫరా, తాగునీటి పథకాలకు నిరంతర విద్యుత్, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా అంతరాయాలపై వేగవంతమైన స్పందన అవసరం. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ ప్రభుత్వం కోరినట్లు సమాచారం. ఈ అంశంపై రాష్ట్ర శాసనసభలో కూడా కేంద్ర సహాయం కోరుతూ తీర్మానం చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఆర్థిక సాయం కోరడం ఒక దశ మాత్రమే. ఎంత నిధి అవసరం, ఏ జిల్లాల్లో ఎంత నష్టం, ఏ రంగానికి ఎంత ఖర్చు, ఏ కాలవ్యవధిలో సహాయం అందించాలి అనే అంశాలతో కూడిన సమగ్ర ప్రతిపాదన కేంద్రానికి సమర్పించాలి. నిధుల వినియోగానికి పారదర్శకమైన ప్రణాళిక ఉండాలి. కేంద్రం నుంచి సాయం కోరే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో తక్షణమే చేపట్టగల చర్యలను వాయిదా వేయకూడదు. అదే సమయంలో కరువు తీవ్రతను అంచనా వేసి కేంద్రం కూడా నిబంధనల ప్రకారం సహాయంపై నిర్ణయం తీసుకోవాలి. ఎల్‌నినోను మనం ఆపలేం. వర్షాలను మన ఆదేశాలతో కురిపించలేం. కానీ వర్షాభావం వల్ల ప్రజలు ఎదుర్కొనే నష్టాన్ని తగ్గించగలం. రైతు పంట ఎండిపోకముందే స్పందించగలం. గ్రామంలో నీటి ఎద్దడి మొదలయ్యేలోపే ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాటు చేయగలం. విద్యుత్ కొరత తలెత్తకముందే సరఫరా ప్రణాళిక సిద్ధం చేయగలం. ఇవన్నీ ప్రభుత్వ పాలనా సామర్థ్యానికి సంబంధించిన అంశాలు. తెలంగాణలో 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నవేళ, ప్రతి మండలంలోని వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడం అత్యవసరం. ఒకే రాష్ట్రంలోనూ కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం తీవ్రంగా ఉండవచ్చు; మరికొన్ని ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉండవచ్చు. అందుకే ఒకే రకమైన నిర్ణయాల కంటే ప్రాంతాలవారీగా అవసరాలను గుర్తించి సహాయం అందించాలి. కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక భరోసా, గ్రామీణ కుటుంబాలకు తాగునీటి భద్రత, పశువులకు మేత, వ్యవసాయ కూలీలకు ఉపాధి, పంటలకు మార్కెట్ మద్దతు వంటి అంశాలను ఒక సమగ్ర ప్యాకేజీలో భాగం చేయాలి. ప్రభుత్వం ప్రకటించే నిధుల మొత్తం కంటే, అవి బాధితుల జీవితాల్లో కలిగించే మార్పు ముఖ్యం. సమీక్షల సంఖ్య కంటే, క్షేత్రస్థాయిలో పరిష్కారమైన సమస్యల సంఖ్య ముఖ్యం. కరువు మండలాల జాబితా కంటే, ఆ మండలాల్లో రైతులకు అందిన సహాయం ముఖ్యం. కేంద్రం నుంచి సాయం కోరడం అవసరమే; కానీ రాష్ట్రం తన వనరులను సమర్థంగా వినియోగించి తక్షణ ఉపశమన చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యం

ప్రతి ఒక్కరు తరచూ చేయించుకోవాల్సిన ముఖ్యమైన వైద్య పరీక్షలు ఇవే..



రక్త పరీక్షల ద్వారా మన శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలు ఎలా ఉన్నాయి, ఐరన్ నిల్వలు సరిపోతున్నాయా, శరీరంలో వాపు సూచనలు ఉన్నాయా వంటి అనేక విషయాలను తెలుసుకోవచ్చు. అయితే, వైద్య పరీక్షల నివేదికల్లో ఉండే సంఖ్యలు, వైద్య పదాల అర్థాలు చాలామందికి సులభంగా అర్థం కావు. అందువల్ల నివేదికలోని ఏ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలో తెలుసుకోవడం ముఖ్యం. పోషకాహార నిపుణురాలు నమామి అగర్వాల్ తన సూచనల్లో భాగంగా ఐదు ముఖ్యమైన ఆరోగ్య సూచికలను వివరించారు. అవి హెచ్‌బీఏ1సీ, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, ఫెరిటిన్, ఫాస్టింగ్ ఇన్సులిన్, హోమా-ఐఆర్, హెచ్‌ఎస్-సీఆర్‌పీ. హెచ్‌బీఏ1సీ పరీక్ష గత మూడు నెలలుగా రక్తంలో చక్కెర స్థాయిలు సగటున ఎలా ఉన్నాయో తెలియజేస్తుంది. ఒకరోజు చేసిన పరీక్షలో వచ్చిన ఫలితాన్ని మాత్రమే కాకుండా, గత కొంతకాలంగా చక్కెర నియంత్రణ ఎలా ఉందో అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

ఎల్‌డీఎల్, హోమా-ఐఆర్..


ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు సాధారణంగా కొలెస్ట్రాల్ పరీక్షలో భాగంగా ఉంటాయి. ఎల్‌డీఎల్ ఒక రకమైన కొలెస్ట్రాల్ కాగా, ట్రైగ్లిజరైడ్లు రక్తంలో ఉండే కొవ్వు పదార్థాలు. వీటి స్థాయిల ద్వారా శరీరం కొవ్వులను, అదనపు కేలరీలను ఎలా వినియోగించుకుంటుందో అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. ఫెరిటిన్ పరీక్ష శరీరంలో నిల్వ ఉన్న ఐరన్ పరిమాణం గురించి తెలియజేస్తుంది. హిమోగ్లోబిన్ స్థాయిలు సాధారణంగా ఉన్నప్పటికీ, ఫెరిటిన్ తక్కువగా ఉంటే శరీరంలో ఐరన్ నిల్వలు తగ్గినట్లు అర్థం అని భావించాలి. ఫాస్టింగ్ ఇన్సులిన్, హోమా-ఐఆర్ పరీక్షలు శరీరం ఇన్సులిన్‌ను ఎలా వినియోగించుకుంటుందో తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. వీటి ద్వారా ఇన్సులిన్ నిరోధకతను ప్రారంభ దశలో గుర్తించేందుకు వైద్యులకు సహాయపడతాయి. ఇక హెచ్‌ఎస్-సీఆర్‌పీ అనేది శరీరంలో వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్‌కు సంబంధించిన సూచిక. గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదాన్ని అంచనా వేయడానికి వైద్యులు ఇతర ఆరోగ్య వివరాలతోపాటు ఈ ఫలితాన్ని కూడా పరిశీలిస్తారు.

ఈ విషయాలను గమనించాలి..

అయితే, రక్త పరీక్షల ఫలితాలను అర్థం చేసుకునేటప్పుడు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. పరీక్షకు ముందు తీసుకున్న ఆహారం, పానీయాలు, వాడుతున్న మందులు లేదా పోషకాహార సప్లిమెంట్లు, అధిక శారీరక వ్యాయామం వంటి అంశాలు కొన్ని పరీక్షల ఫలితాలపై ప్రభావం చూపిస్తాయి. నెలసరి సమయంలో కూడా కొన్ని పరీక్షల ఫలితాల్లో మార్పులు కనిపించే అవకాశం ఉంది. అందుకే పరీక్షకు ముందు ఉపవాసం ఉండడం లేదా కొన్ని ఆహారాలను తీసుకోకుండా ఉండడం వంటి సూచనలు ఇస్తే వాటిని తప్పనిసరిగా పాటించాలి. పరీక్షకు ఎలా సిద్ధం కావాలో వైద్యులు లేదా ఆరోగ్య నిపుణులు తెలియజేస్తారు. ఫలితాలు సాధ్యమైనంత కచ్చితంగా రావాలంటే వారి సూచనలను జాగ్రత్తగా అనుసరించాలి. వైద్య పరీక్షల నివేదికలను సరిగ్గా అర్థం చేసుకోవడం ద్వారా మన ఆరోగ్య పరిస్థితిని మరింత మెరుగ్గా తెలుసుకునే వీలు ఉంటుంది.

రోజూ 6 గంటల కన్నా తక్కువగా నిద్రిస్తున్నారా..

అయితే జాగ్రత్త.. నిపుణుల హెచ్చరిక..



రోజూ తగినంత నిద్రపోవడం శరీరానికి విశ్రాంతిని ఇవ్వడమే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే పని, సామాజిక బాధ్యతలు, ఎక్కువ సమయం తెరల ముందు గడపడం వంటి కారణాలతో చాలామంది నిద్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ముఖ్యంగా రోజూ ఆరు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోవడం అలవాటుగా మారితే, ఉదయం అలసటగా ఉండడమే కాకుండా కాలక్రమేణా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. తగినంత నిద్రలో ఉన్నప్పుడు గుండె వేగం, రక్తపోటు తగ్గుతాయి. దీంతో గుండె, రక్తనాళాలకు విశ్రాంతి లభిస్తుంది. నిద్ర తగ్గినప్పుడు ఈ విశ్రాంతి సమయం తగ్గి రక్తపోటు పెరగడంతో పాటు శరీరాన్ని అప్రమత్తంగా ఉంచే సానుభూతి నాడీ వ్యవస్థ అధికంగా పనిచేస్తుంది.

అనేక సమస్యలు..

నిద్రలేమి ప్రభావం కేవలం అధిక రక్తపోటుకే పరిమితం కాదు. ఆకలి, రక్తంలో చక్కెర స్థాయిలు, జీవక్రియను నియంత్రించే హార్మోన్ల సమతుల్యతకూ నిద్ర ముఖ్యమే. తగినంత నిద్రపోని వారిలో అధిక కేలరీలు ఉండే ఆహారాలపై కోరిక పెరుగుతుంది. వ్యాయామం చేయాలనే ఉత్సాహం కూడా తగ్గుతుంది. ఈ పరిస్థితులు దీర్ఘకాలంలో శరీర బరువు పెరగడం, ఊబకాయం, రక్తంలో చక్కెర నియంత్రణ సరిగా లేకపోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇవన్నీ గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన ప్రమాద కారకాలుగా మారుతాయి. అయితే ఒక్కరోజు నిద్ర సరిగా లేకపోవడం, ప్రతిరోజూ ఐదు లేదా ఆరు గంటలకే పరిమితమవడం ఒకే రకమైన ప్రభావాన్ని చూపవు. నిద్రలేమి రోజువారీ జీవితంలో అలవాటుగా మారినప్పుడే దీర్ఘకాలిక ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

నిద్ర నాణ్యత ముఖ్యం..

నిద్ర ఎంతసేపు పడుతున్నామన్నదే కాకుండా, నిద్ర నాణ్యత కూడా అంతే ముఖ్యం. ఏడు లేదా ఎనిమిది గంటలు నిద్రపోయినా శ్వాస సంబంధిత సమస్యలు, తరచూ నిద్ర మేల్కొనడం, ఒత్తిడి, కొన్ని మందుల దుష్ప్రభావాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా నిద్ర నాణ్యత తగ్గుతుంది. అందువల్ల తగినంత సమయం నిద్రపోయినా విశ్రాంతి లభించకపోతే దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. నిద్రపోయేందుకు తరచూ ఇబ్బంది పడడం, రాత్రివేళ పదేపదే మేల్కొనడం లేదా పగటిపూట అధిక నిద్రమత్తు ఉండడం వంటి సమస్యలు కొనసాగితే వైద్యులను సంప్రదించడం అవసరం. సమస్యకు కారణమయ్యే ఇతర ఆరోగ్య పరిస్థితులను గుర్తించడం కూడా ముఖ్యమే.

రోజూ నెయ్యి తినడం గుండెకు చెడు చేస్తుందా..?



వేడివేడి అన్నంలో నెయ్యి .. పప్పులో నెయ్యి.. రోటీ పై నెయ్యి.. ఇలా మన దేశంలో నెయ్యికి ఉన్న ప్రత్యేకతే వేరు. పెద్దలు నెయ్యి ఆరోగ్యానికి చాలా మంచిదని చెబుతుంటారు. పసిపిల్లలకు నెయ్యి పెడితే బలమంటారు. రుచికి కూడా తిరుగుండదు. అయితే నెయ్యి అతిగా తింటే గుండె ఆరోగ్యం పై ప్రభావం పడుతుందా..? నెయ్యి గుండెకు మేలు చేస్తుందా చెడు చేస్తుందా..? వైద్య నిపుణులు ఏమంటున్నారు..? ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం..?నెయ్యిలో శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. 100 గ్రాముల నెయ్యిలో దాదాపు 883 కిలోకేలరీలు ఉంటాయి. కాబట్టి నెయ్యిని మితంగా తీసుకుంటే సమస్య లేదు. అతిగా తీసుకుంటేనే కొవ్వు పేరుకుంటుంది. కాబట్టి నెయ్యిని తరచూ తినడంతో సమస్య ఉండదు. నెయ్యిని ఎంత మోతాదులో తీసుకుంటున్నామన్నదే అసలు సమస్య. పప్పుకు ఓ చెంచా.. అన్నానికి మరో చెంచా.. రోటీకి ఇంకో చెంచా.. ఇలా రోజంతా తెలియకుండానే నెయ్యి పరిమాణం పెరిగిపోవచ్చు. అదే అలవాటు కొనసాగితే శరీరంలోకి అవసరానికి మించిన కొవ్వు చేరుతుంది. శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా తీసుకోవడంవల్ల రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. కొలెస్ట్రాల్ ఎక్కువ కాలం అధికంగా ఉంటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఉంటుంది. ఇది గుండె జబ్బుల ముప్పును పెంచుతుంది. కాబట్టి రోజూ నెయ్యి తినే అలవాటు మంచిదే అయినా.. మోతాదుకు మించకుండా చూసుకోవడం ఉత్తమమని నిపుణులు అంటున్నారు. ఆరోగ్యంగా ఉన్న పెద్దవాళ్లు రోజుకు ఒకటి నుంచి రెండు టీస్పూన్ల నెయ్యిని తీసుకోవచ్చు. అయితే నెయ్యితోపాటు వంట నూనెలు, వెన్న వంటి అన్ని కొవ్వుల పరిమాణాన్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి. ఇప్పటికే గుండె జబ్బులు, మధుమేహం లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు నెయ్యి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. వారి ఆహారంలో కొవ్వుల పరిమాణాన్ని వైద్యుడు లేదా పోషకాహార నిపుణుడి సూచన మేరకు నిర్ణయించుకోవడం మంచిది. కాబట్టి నెయ్యిని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. వంటలో సుమారుగా కాకుండా చెంచాతో కొలత చూసుకుని వాడటం అలవాటు చేసుకోవాలి. వంట చివర్లో కొద్దిగా నెయ్యి వేసినా మంచి రుచి, వాసన వస్తాయి.

ఉదయాన్నే ఖాళీ కడుపుతో అరటిపండు తినడం మంచిదేనా?

నిపుణులు ఏం చెబుతున్నారంటే..



అరటిపండులో అనేక పోషకాలు ఉన్నప్పటికీ, ఉదయాన్నే పరగడుపున దీన్ని తినడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అరటిపండ్లు సహజంగానే మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలను కలిగి ఉంటాయి. అంతేకాకుండా, ఇందులో ఉండే సహజమైన ఆమ్లాలు కడుపులో గ్యాస్, ఎసిడిటీ, జీర్ణ సమస్యలను సృష్టిస్తాయి. కాబట్టి అరటిపండును ఎప్పుడూ ఉదయం అల్పాహారం తిన్న తర్వాత లేదా ఇతర పండ్లతో కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం.

గుండె, రక్తపోటుపై ప్రభావం: అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం మూలకాలు అత్యధికంగా ఉంటాయి. మనం ఏమీ తినకుండా ఉదయాన్నే పరగడుపున నేరుగా అరటిపండు తిన్నప్పుడు, రక్తంలో మెగ్నీషియం, పొటాషియం స్థాయిలు ఒక్కసారిగా అకస్మాత్తుగా పెరుగుతాయి. రక్తంలో ఈ ఖనిజాల సమతుల్యత దెబ్బతినడం వల్ల గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జీర్ణక్రియ సమస్యలు, ఎసిడిటీ:

అరటిపండులో సహజంగానే ఆమ్ల గుణం ఉంటుంది. ఖాళీ కడుపుతో దీన్ని తీసుకున్నప్పుడు కడుపులో గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం, ఎసిడిటీ సమస్యలు తలెత్తుతాయి. జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారికి ఇది మరింత అసౌకర్యాన్ని కలిగిస్తుంది. అంతేకాకుండా, ఇందులో ఉండే షుగర్ కంటెంట్ వల్ల తిన్న కొద్దిసేపటికే శక్తి తగ్గిపోయి తీవ్రమైన అలసట అనిపించవచ్చు.

సరైన తినే విధానం ఏమిటి?:

అరటిపండులో ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. కాబట్టి దీన్ని పూర్తిగా మానుకోవాల్సిన అవసరం లేదు. కానీ, దీన్ని తినే సరైన పద్ధతిని పాటించాలి. ఉదయాన్నే ఎప్పుడూ ఒంటరిగా అరటిపండు తినకండి. అల్పాహారం తిన్న తర్వాత లేదా ఓట్స్, డ్రై ఫ్రూట్స్, పాలు వంటి ఇతర ఆహార పదార్థాలతో కలిపి తీసుకోవడం చాలా మంచిది. ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్ సమయంలో లేదా సాయంత్రం వేళల్లో స్నాక్‌గా దీన్ని తింటే శరీరానికి పూర్తి పోషకాలు అందుతాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పండ్లు తినడం ఎంత ముఖ్యమో, వాటిని ఏ సమయంలో, ఏ విధంగా తీసుకోవాలో తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

కేంద్ర బలగాలను ఈ నెల 20 వరకు ఉపసంహరించొద్దు..

-హోంశాఖకు ఢిల్లీ పోలీసుల లేఖ



అక్టోబర్ 13 (వార్త సంధ్య)

ఆందోళనలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల లను ఇప్పుడే ఉపసంహరించవద్దని, కేంద్ర బలగాల మోహరింపును ఈ నెల 20 వరకు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు (ణవశ్రీశ్రీష్ట్ర ఖ్రాశీశ్రీఅఎవ) కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ కి లేఖ రాశారు. ఈ విషయాన్ని ఢిల్లీ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. ఆందోళనలు పెరిగే అవకాశం ఉందనే నిఘావర్గాల సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటంతోపాటు ఉద్రిక్తతలకు తావులేకుండా ఉండేందుకే గడువు పెంచాలని కోరినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం విధుల్లో ఉన్న 273 కంపెనీల బలగాల మోహరింపు గడువు సోమవారంతో ముగిసింది. మరోవైపు జంతర్‌మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం, పార్లమెంట్ హౌస్, ఇండియా గేట్ వంటి ప్రాంతాల్లో నిరసనలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ 273 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపును పొడిగించాలని పోలీసులు తమ లేఖలో పేర్కొన్నారు. నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో మొత్తం 301 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలకు అనుమతి లభించింది. అక్టోబర్ 6న 221 కంపెనీలకు, 8న మరో 80 కంపెనీలకు ఆమోదం తెలపడంతో ఆ కంపెనీలు విధుల్లో పాల్గొన్నాయి. అదనంగా మంజూరైన 80 బలగాల్లో 28 సోమవారం నాటికి ఢిల్లీకి చేరుకోలేదు.

ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి వంటిది!

నిరసనలపై ఉక్కుపాదం మోపి ప్రధాని మోదీ వాక్కులు



న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (వార్త సంధ్య) : దేశ రాజధానిలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు అడ్డుకునే క్రమంలో భద్రతా సిబ్బంది నిరసనకారులపై దాడి చేయడం, వారిని అదుపులోకి తీసుకోవడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడిన తర్వాత ప్రజల ముందుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యానికి భారత్ తల్లిగా అభివర్ణించారు. మంగళవారం న్యూఢిల్లీలో ప్రారంభమైన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మోదీ సుదీర్ఘ ప్రసంగం చేశారు. అధికారం ఎవరి చేతిలో ఉన్నది అనేది అసలు ప్రశ్న కాదు. ఆ అధికారాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు అన్నదే అసలు ప్రశ్న అని మోదీ తన విధానాలకు విరుద్ధంగా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యయుత నిరసనలను అణచివేస్తూనే భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లిగా పేర్కొన్న మోదీ భారతీయుల సోషల్ మీడియా వినియోగాన్ని కూడా నొక్కిచెప్పారు.

గేటు దూకి జంతర్ మంతర్‌లోకి..

పోలీసుల అదుపులో సీజేపీ నాయకులు



న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (వార్త సంధ్య) ఇతర మద్దతుదారులతో పాటు సీజేపీ కార్యకర్త అజింక్యా షిండేను కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు కావడానికి ముందు రాంకా ఎక్స్‌లో ఒక వీడియో క్లిప్‌ను పోస్ట్ చేశారు. అందులో, తాను, దాస్, ఇతర సీజేపీ మద్దతుదారులు ఒక గేటు పైనుంచి దూకి జంతర్ మంతర్ ప్రాంగణంలోకి ప్రవేశిస్తున్నట్టు ఆ వీడియోలో ఉంది.ఆయన ఆ వీడియోకు జంతర్ మంతర్ జోలికి రావద్దు అని శీర్షిక పెట్టారు. జంతర్ మంతర్ సమీపంలోని జనతాదళ్(యునైటెడ్) కార్యాలయ ప్రాంగణం వైపు నుంచి ఆ బృందం నిరసన స్థలంలోకి ప్రవేశించినట్టు తెలుస్తున్నది. వెంటనే పోలీసులు ఆ ప్రాంతంలోకి ప్రవేశించిన వారినందరినీ అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమను అదుపులోకి తీసుకుంటున్నప్పుడు రాంకా, ఇతర సీజేపీ మద్దతుదారులు ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతా కీ జై అని నినాదాలు చేస్తున్న వీడియోను కూడా దాస్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. జంతర్ మంతర్‌ను స్వాధీనం చేసుకున్నామని ప్రకటించిన ఆయన లోపలికి ప్రవేశించడాన్ని యువతరానికి ఒక సందేశంగా అభివర్ణించారు.

రాహుల్ నన్ను తోసేశాడు

గర్భిణి జర్నలిస్టు తీవ్ర ఆరోపణలు

న్యూఢిల్లీ: అక్టోబర్ 13 (వార్త సంధ్య)

సర్ ప్రక్రియపై విపక్షాలు జరిపిన నిరసన సందర్భంగా సోమవారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తన చేతిని దురుసుగా లాగి, తోసివేశారని మూడు నెలల గర్భవతి అయిన ఒక జర్నలిస్టు ఆరోపించారు. అయితే ఇలాంటి ఘటన ఏదీ జరగలేదని కాంగ్రెస్ ఖండించింది. ఇది బీజేపీ సృష్టించిన ప్రచారమని పార్టీ పేర్కొంది. తనపై దాడి జరిగిందని ఆరోపించిన 'ఒన్ ఇండియా' వార్తా వెబ్‌సైట్‌కు చెందిన రిచా పరాశర్ దేశ రాజధానిలోని ఒక దవాఖానలో చేరారు. రాహుల్ గాంధీ మద్దతుదారులు తన గురించి దుర్భాషలాడటం, తాను అనుభవించిన ఘటనను తక్కువ చేసి చూపడానికి ప్రయత్నించడం పట్ల తీవ్ర మనస్తాపానికి గురైనట్టు ఆమె చెప్పారు.

ఫ్రాన్స్‌లో వందలాది సూపర్ మార్కెట్లపై సైబర్ దాడి

-ఫ్రిజ్‌లలో '50' దాటిన ఉష్ణోగ్రతలు

-పెద్దమొత్తంలో పాడైపోయిన ఆహారం

-కొన్ని స్టోర్లలో చెలరేగిన మంటలు



పారిస్: అక్టోబర్ 13 (వార్త సంధ్య)

ఫ్రాన్స్‌లో వందలాది సూపర్ మార్కెట్లపై సైబర్ దాడి జరిగింది. రిఫ్రిజిరేషన్ వ్యవస్థల ధ్వంసం లక్ష్యంగా ఈ దాడి జరిగింది. దీని కారణంగా దేశవ్యాప్తంగా 480 దుకాణాలు, స్టోర్లలోని ఫ్రిజ్‌లు, ఫ్రీజర్ల ఉష్ణోగ్రత 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుని అధిక ఉష్ణోగ్రతకు పలు స్టోర్లలోని ఫ్రిజ్‌లకు మంటలంటుకున్నాయి. కోట్లాది యూరోల నష్టం ఏర్పడిన ఈ తరహా సైబర్ దాడి దేశంలో ఇదే ప్రథమమని ఫ్రాన్స్ అధికారులు తెలిపారు. ఫ్రెంచ్ మీడియా కథనం ప్రకారం చాలా స్టోర్లలోని ఫ్రిజ్‌లు, ఫ్రీజర్లు ఆటోమేటిక్‌గా డీఫ్రాస్ట్ మోడ్‌లోకి వెళ్లేలా హ్యాకర్లు సైబర్ దాడి చేశారు. దీంతో తాజా, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు పాడవ్వడమే కాక, అధిక ఉష్ణోగ్రతకు పేలుడు సంభవించి మంటల్లో చిక్కుకున్నాయి.పలు స్టోర్లలోని ఫ్రిజ్‌లు మంటల్లో చిక్కుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు జరపాలని ఫ్రెంచి ప్రధాని లెకోర్న్ దేశ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఏఎన్ఎస్ఎస్ఐను ఆదేశించారు. ఇతర ఐరోపా దేశాల్లో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయా? అని ప్రభుత్వం ఆరాతీస్తున్నది. పలు ఆహార రిటైల్ సంస్థల్లో ఇంటర్నెట్‌తో అనుసంధానించి ఉన్న రిఫ్రిజిరేటర్లపై ఈ దాడి జరిగిందని పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. కాగా, ప్రధాని ఆఫీస్ అధికారి ప్రకారం డెన్మార్క్‌కు చెందిన డాన్‌ఫాస్ కంపెనీ సాఫ్ట్‌వేర్‌లో ఫ్రాన్స్ సైబర్ సెక్యూరిటీ ఒక లోపాన్ని గుర్తించింది. ఈ కంపెనీ సిస్టమ్‌లను సూపర్‌మార్కెట్ ఫ్రిజ్‌లు, ఫ్రీజర్‌లను నియంత్రించడానికి ఉపయోగిస్తారు. కాగా, దుర్ఘటనలకు కారణమైన సిస్టమ్‌లలో కంపెనీ సాఫ్ట్‌వేర్ పాత వెర్షన్ నడుస్తున్నది.తమ సాఫ్ట్‌వేర్‌లను అప్‌డేట్ చేసుకోవాలని, పాతబడిన పరికరాలను మార్చుకోవాలని చాన్నాళ్లుగా తమ వినియోగదారులకు సలహాలు ఇస్తున్నట్టు ఆ కంపెనీ తెలిపింది.

ఎలా జరిగింది?

సూపర్‌మార్కెట్ ఫ్రిజ్‌లు, ఫీజర్‌లు సాధారణంగా స్టోర్ మొత్తం రిఫ్రిజిరేషన్ ప్రక్రియను నిర్వహించే ఒక కంట్రోల్ ప్యానల్ వ్యవస్థ ద్వారా పనిచేస్తాయి. ఈ ప్యానెళ్లు ఇంటర్నెట్‌కు అనుసంధానించి ఉంటాయి. కాబట్టి నిర్వహణ సంస్థలు వాటి సెట్టింగ్‌లను రిమోట్‌గా మార్చగలవు. ఒక వేళ హ్యాకర్ ఈ వ్యవస్థలోకి ప్రవేశించగలిగితే వారు భద్రతా లోపాలను ఉపయోగించుకుని ఫ్రిజ్‌లు, ఫ్రీజర్‌ల సెట్టింగ్‌లను మార్చగలరు. దీనివల్ల వారు కూలింగ్‌ను తగ్గించడం, లేదా డీఫ్రాస్టింగ్‌కు మార్చగలరు.

భారత సైన్యానికి మరింత బలం..

-450 నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లు అందజేత

-ఒకేసారి 450 డ్రోన్లను అందించిన దేశీయ సంస్థ

-సైనిక అవసరాల కోసం ప్రత్యేకంగా తయారీ

-తక్కువ దూరంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం

-అవసరమైతే వెనక్కి వచ్చి సురక్షితంగా దిగే అవకాశం



న్యూఢిల్లీ: అక్టోబర్ 13 (వార్త సంధ్య)

భారత సైన్యానికి మరింత బలం చేకూరనుంది. దేశీయంగా తయారైన 450 నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లను సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) భారత సైన్యానికి అందించింది. ఒకే దశలో ఇంత పెద్ద సంఖ్యలో డ్రోన్లను సరఫరా చేయడం ఈ సంస్థకు కీలక మైలురాయిగా నిలిచింది. సైనిక అవసరాల కోసం అత్యవసర కొనుగోళ్లలో భాగంగా ఈ డ్రోన్లను తయారు చేయించారు. తక్కువ దూరంలోని లక్ష్యాలను గుర్తించి దాడి చేయగల సామర్థ్యం వీటి ప్రత్యేకత. నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లు లక్ష్యంపై దాడి చేయడానికి రూపొందించిన ప్రత్యేక రకానికి చెందినవి. వీటిని సాధారణంగా 'కమికాజి' లేదా 'సూసైడ్ డ్రోన్లు' అని పిలుస్తారు. లక్ష్యాన్ని ఢీకొని పేలడం ద్వారా దాడి చేయడం ఈ రకమైన డ్రోన్ల ప్రధాన లక్షణం. అయితే, నాగాస్త్ర-1ఆర్ విషయంలో అవసరాన్ని బట్టి ప్రయాణాన్ని నిలిపివేసి వెనక్కి మళ్లే సామర్థ్యం కూడా ఉందని అందించిన సమాచారం పేర్కొంటోంది. దీంతో ప్రతి పరిస్థితిలోనూ డ్రోన్‌ను నాశనం చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు.

ఒకేసారి భారీ సరఫరా

సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఎస్‌డీఏఎల్ ఈ డ్రోన్లను తయారు చేసింది. ఒకే దశలో 450 డ్రోన్లను సైన్యానికి అందించడం దేశీయ రక్షణ ఉత్పత్తుల రంగంలో ప్రాధాన్యం సంతరించుకుంది. సైనిక అవసరాలకు అనుగుణంగా ఆయుధాలు, సాంకేతిక పరికరాలను దేశంలోనే తయారు చేసుకునే ప్రయత్నాలకు ఇది ఉదాహరణగా నిలుస్తోంది. విదేశాల నుంచి ఆయుధాలను కొనుగోలు చేయడంపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు దేశీయ ఉత్పత్తులు ఉపయోగపడతాయి. గత ఏడాది మార్చిలో భారత సైన్యం ఈ డ్రోన్ల తయారీ కోసం వివిధ సంస్థలను ఆహ్వానించింది. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా డ్రోన్లను తయారు చేయగల సంస్థలకు అవకాశం కల్పించేలా ప్రక్రియ చేపట్టింది. ఈ పోటీలో ఎస్‌డీఏఎల్ నిర్దేశిత ప్రమాణాలను అందుకోవడంతో టెండర్ దక్కించుకున్నట్లు సమాచారం. అనంతరం అత్యవసర కొనుగోలు ప్రక్రియలో భాగంగా డ్రోన్ల తయారీ, సరఫరా చేపట్టింది.

లక్ష్యంపై దాడి.. అవసరమైతే వెనక్కి

యుద్ధభూమిలో శత్రు లక్ష్యాలను గుర్తించి వాటిపై దాడి చేయడానికి డ్రోన్లు కీలకంగా మారుతున్నాయి. ముఖ్యంగా తక్కువ దూరంలోని లక్ష్యాలపై దాడి చేయగల డ్రోన్లు సైన్యానికి ఉపయోగకరంగా ఉంటాయి. సైనికుల ప్రాణాలకు ప్రమాదం కలగకుండా దూరం నుంచే లక్ష్యాలపై చర్యలు చేపట్టేందుకు ఇవి సహాయపడతాయి. సంప్రదాయ ఆయుధాలతో పోలిస్తే కొన్ని సందర్భాల్లో తక్కువ ఖర్చుతో లక్ష్యాన్ని చేరుకునే అవకాశం కూడా ఉంటుంది. సాధారణంగా ఒకసారి ప్రయోగించిన దాడి డ్రోన్లు లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత తిరిగి వినియోగించుకునే అవకాశం ఉండదు. అయితే, కొన్ని ఆధునిక డ్రోన్లలో ప్రయాణాన్ని మధ్యలో నిలిపివేసి తిరిగి వెనక్కి వచ్చే సౌకర్యం ఉంటుంది. నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లకు కూడా అవసరాన్ని బట్టి వెనక్కి మళ్లే, సురక్షితంగా దిగే సామర్థ్యం ఉన్నట్లు సమాచారం. ఈ సదుపాయం వల్ల పరిస్థితులకు అనుగుణంగా వాటి వినియోగంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే, ఈ సామర్థ్యాలు ఏయే పరిస్థితుల్లో పనిచేస్తాయనే పూర్తి సాంకేతిక వివరాలు అందుబాటులో ఉన్న సమాచారంలో స్పష్టంగా లేవు.

దేశీయ తయారీతో ఖర్చుల తగ్గింపు

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తమ రక్షణ సామర్థ్యాలను పెంచుకునేందుకు ఆధునిక ఆయుధాలు, డ్రోన్లను సమకూర్చుకుంటున్నాయి. యుద్ధాలు, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయుధాల కొనుగోలు దేశాలపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఈ పరిస్థితుల్లో దేశీయంగా రక్షణ పరికరాలను తయారు చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసుకుని, దేశంలోనే ఉత్పత్తి చేయడం ద్వారా విదేశీ కొనుగోళ్లపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. దేశీయ తయారీ సంస్థలకు సైన్యం నుంచి ఆర్డర్లు లభించడం వల్ల ఉత్పత్తి సామర్థ్యాలు పెరగడంతోపాటు కొత్త సాంకేతికతల అభివృద్ధికి ప్రోత్సాహం లభిస్తుంది. సైన్యానికి అవసరమైన పరికరాలను వేగంగా సరఫరా చేసే అవకాశం కూడా ఉంటుంది. నాగాస్త్ర-1ఆర్ డ్రోన్ల సరఫరా ఈ దిశగా మరో ముందడుగుగా భావిస్తున్నారు.

మరిన్ని ఆధునిక ఆయుధాలపై దృష్టి

ఎస్‌డీఏఎల్ భవిష్యత్తులో మరిన్ని ఆధునిక రక్షణ పరికరాలను తయారు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా డ్రోన్లు, ఇతర సాంకేతిక ఆయుధాల అవసరం పెరుగుతోంది. నిఘా, లక్ష్యాలను గుర్తించడం, దాడి సామర్థ్యాలను మెరుగుపరచడం వంటి అవసరాల్లో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ సంస్థలు సాంకేతికతను అభివృద్ధి చేయడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం ముఖ్యమవుతోంది. భారత సైన్యానికి 450 నాగాస్త్ర-1ఆర్ డ్రోన్లు అందడం వల్ల దేశీయ రక్షణ తయారీ రంగానికి ప్రోత్సాహం లభించనుంది. అయితే, వీటి వాస్తవ వినియోగం, పనితీరు, సైనిక అవసరాలకు అనుగుణంగా అందించే సేవలపై మరిన్ని అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది. దేశ రక్షణ అవసరాలను తీర్చడంలో దేశీయ తయారీ సంస్థల పాత్ర భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది.

పాకిస్థాన్‌లో రైలు ప్రమాదం.. ఆరుగురు దుర్మరణం

-పట్టాలు తప్పిన రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్

-మరో 30 మందికి గాయాలు

-పంజాబ్ ప్రావిన్స్‌లో తెల్లవారుజామున ప్రమాదం

-కరాచీ నుంచి పెషావర్ వెళ్తుండగా ఘటన

-ముల్తాన్‌లో షేర్ షా బ్రిడ్జి సమీపంలో ప్రమాదం

-14 రైలు పెట్టెలు పట్టాలు తప్పినట్లు సమాచారం



పాకిస్థాన్: అక్టోబర్ 13 (వార్త సంధ్య)

పాకిస్థాన్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. పంజాబ్ ప్రావిన్స్‌లో మంగళవారం ఉదయం ప్రయాణికుల రైలు పట్టాలు తప్పడంతో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 30 మంది గాయపడ్డారు. కరాచీ నుంచి పెషావర్‌కు వెళ్తున్న రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్ ముల్తాన్‌లోని షేర్ షా బ్రిడ్జి సమీపంలో ప్రమాదానికి గురైంది. రైలులోని 14 పెట్టెలు పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. మృతుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ైలు పట్టాలు తప్పడంతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దెబ్బతిన్న రైల్వే మార్గాన్ని పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత రైళ్ల రాకపోకలను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారుల నుంచి మరిన్ని వివరాలు వెలువడాల్సి ఉంది.

సౌదీకి ఇండిగో విమానాలు రద్దు!

-అక్టోబర్ 17 వరకు సర్వీసులు నిలిపివేత

-రియాద్, జెద్దా, దమ్మాం, మదీనా విమానాలపై ప్రభావం

-ప్రయాణికుల భద్రత కోసమే నిర్ణయం

-విమానాల వివరాల కోసం వెబ్‌సైట్ చూడాలని సూచన

-ప్రయాణికులకు సహాయక బృందం అందుబాటులో



న్యూఢిల్లీ: అక్టోబర్ 13 (వార్త సంధ్య)

సౌదీ అరేబియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్-సౌదీ మధ్య విమాన సర్వీసులను అక్టోబర్ 17 వరకు రద్దు చేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. రియాద్, జెద్దా, దమ్మాం, మదీనా విమానాశ్రయాలకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే సర్వీసులు నిలిచిపోనున్నాయి. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. విమానాల తాజా వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించింది.

వార్తసంధ్య
www.vaarthasandhya.com



పరువాలతో పిచ్చెక్కిస్తోన్న వయ్యారి!

ప్రభాస్ 'కల్కి 2' మూవీకి
సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్..

పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక సిక్వెల్ చిత్రం 'కల్కి 2'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ప్రభాస్ ఇతర సినిమాల కమిట్‌మెంట్ల కారణంగా ఈ ప్రాజెక్ట్ షూటింగ్ కొద్దిగా నెమ్మదిగా సాగుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ చిత్రంలో కీలకమైన పాత్ర కోసం ప్రముఖ నటి సాయి పల్లవి ఎంపికైన విషయం తెలిసిందే. వాస్తవానికి ఆమె ఈ అక్టోబర్ నెలలోనే సినిమా షూటింగ్ సెట్స్‌లో జాయిన్ కావాల్సి ఉండగా, మేకర్స్ ప్లాన్‌లో స్వల్ప మార్పులు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం సాయి పల్లవి తాను నటిస్తున్న 'రామాయణం' సినిమా ప్రమోషన్లు మరియు ఇతర కార్యక్రమాలపై పూర్తి దృష్టి పెట్టారు. ఈ పవిత్ర పౌరాణిక చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, ఆ సినిమా రిలీజ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆమె 'కల్కి 2' షూటింగ్ షెడ్యూల్‌లో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక క్లారిటీ రానుంది.



'పర్ణశాల' సినిమా నుంచి వైరల్
'జిమ్ జిమ్ తార' ఫుల్ సాంగ్ రిలీజ్!

హారర్ కామెడీ జోనర్‌లో వస్తున్న 'పర్ణశాల' చిత్రం నుంచి ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్న 'జిమ్ జిమ్ తార' పూర్తి పాటను చిత్ర యూనిట్ ప్రముఖ ఆదిత్య మ్యూజిక్ ద్వారా అధికారికంగా విడుదల చేసింది. జి.లక్ష్మిదేవి రచించి, స్వయంగా ఆలపించిన ఈ పాట ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. కాగా, తాజాగా ఫుల్ సాంగ్ విడుదల కావడంతో సినిమాపై అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయి.ఈ సందర్భంగా దర్శకుడు వై.జి. భరత్ మాట్లాడుతూ మా చిత్రంలోని ఈ పాటకు ప్రేక్షకుల నుంచి ఊహించని స్థాయిలో అద్భుతమైన స్పందన వస్తోందని, ఆదిత్య మ్యూజిక్ ద్వారా పాటను విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ పాటకు నెటిజన్లు రీల్స్ చేస్తూ తెగ ఎంజాయ్ చేస్తున్నారని, ఫుర్తి పాట కూడా అందరినీ అలరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పూర్తి పాట అధికారికంగా రాకముందే దీనికి సంబంధించిన క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి.ఎస్ఎల్‌టీ ఫిలిమ్స్ పతాకంపై మంచి వెంకట్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వై.జి. భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్, కామెడీతో పాటు సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. వినూత్న ప్రచార కార్యక్రమాలతో దూసుకుపోతున్న ఈ చిత్రానికి అశోక్ దయ్యాల పీఆర్ఓగా వ్యవహరిస్తున్నారు.



నితిన్‌కి జోడీగా?

లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒకరాజు చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకున్నది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యకు జోడీగా 'వృషకర్మ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్న మీనాక్షికి మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ టాక్ బలంగా వినిపిస్తున్నది.'సామజవరగమన' వంటి బ్లాక్‌బస్టర్ తెరకెక్కించిన రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నితిన్ హీరోగా ఓ రొమాంటిక్ కామెడీ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈసినిమాలో కథానాయికగా మీనాక్షి చౌదరి ఖరారైనట్టు వినికిడి. అయితే.. దీనిపై అధికారిక స్పష్టత రావాల్సివుంది. జనవరిలో సెట్స్‌పైకి వెళ్లే ఈసినిమాను ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్నట్టు సమాచారం.



బాక్సాఫీస్ వద్ద శ్రీ విష్ణు
కామ్రేడ్ కళ్యాణ్' జోరు.

-హిట్‌గా నిలిచిన కామెడీ డ్రామా!



వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటారు. ఆయన నటించిన తాజా కామెడీ డ్రామా 'కామ్రేడ్ కళ్యాణ్' తొలి వారాంతంలో మంచి వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. విడుదలైన తొలిరోజు నెమ్మదిగా ప్రారంభమైన ఈ సినిమా.. సాయంత్రం ఆటల నుంచి పుంజుకుంది. సినిమాకు సానుకూల స్పందన రావడంతో ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. దీంతో నాలుగు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ అయిందని మేకర్స్ పోస్టర్ ద్వారా తెలియజేశారు. దసరా సెలవులు కూడా కలిసి రావడంతో ఈ సినిమా సూపర్ హిట్ కావడం ఖాయమనే అంచనాకు వస్తున్నారు.శ్రీ విష్ణు సినిమాలంటేనే వినోదంతో పాటు విభిన్నమైన కథాంశాలు గుర్తుకొస్తాయి. ఈ క్రమంలో వచ్చిన 'కామ్రేడ్ కళ్యాణ్' కూడా ప్రేక్షకులను ఆకట్టుకునే కామెడీ డ్రామాగా నిలుస్తోంది. విడుదలైన మొదటి రోజు ప్రారంభంలో వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోయినప్పటికీ, సాయంత్రం ఆటల నుంచి పరిస్థితి మెరుగుపడింది. తొలి వారాంతంలో ఈ సినిమా తన జోరును కొనసాగించింది. సాధారణంగా కొత్త సినిమాలకు వారాంతంలో ప్రేక్షకుల ఆదరణ కీలకంగా ఉంటుంది. ఈ విషయంలో 'కామ్రేడ్ కళ్యాణ్'కు కలిసి రావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ప్రదర్శన కనబరిచినట్లు ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. చాలా సినిమాలకు సోమవారం నుంచి వసూళ్లు తగ్గడం సాధారణం. అయితే 'కామ్రేడ్ కళ్యాణ్' పనిదినాలలోనూ నిలకడను ప్రదర్శించింది. ఈ పరిణామంతో సినిమా హిట్ స్థాయికి చేరుకుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఈ చిత్రాన్ని కొనుగోలు చేసిన పంపిణీదారులు సేఫ్ సైడ్‌లో ఉన్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. అయితే, సినిమా సూపర్‌హిట్‌గా నిలుస్తుందా లేదా అనేది రాబోయే రోజుల్లో వసూళ్లు ఏ స్థాయిలో కొనసాగుతాయనే అంశంపై ఆధారపడి ఉంటుంది. దసరా సందర్భంగా కొత్త సినిమాలు థియేటర్లలోకి వస్తున్న నేపథ్యంలో 'కామ్రేడ్ కళ్యాణ్' వాటి పోటీని తట్టుకుని ఎంతకాలం నిలబడుతుందన్నది కీలకంగా మారింది. 'కామ్రేడ్ కళ్యాణ్'లో శ్రీ విష్ణు సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటించారు. జనకిరామ్ మరెళ్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సత్య, రాధిక, సుదర్శన్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, సాయిచంద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు.

నవ్వులు పూయిస్తున్న
'ఉడ్తా తీర్' కొత్త ట్రైలర్!



బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా, టాలెంటెడ్ హీరోయిన్ సారా అలీ ఖాన్ జంటగా నటిస్తున్న తాజా యాక్షన్-కామెడీ చిత్రం 'ఉడ్తా తీర్' . ఆకాష్ ఎ. కౌశిక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి కొత్త ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా 'బిలాల్' అనే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఏజెంట్ పాత్రలో కనిపించబోతున్నాడు. రహస్య మిషన్‌లో భాగంగా భారత్‌కు వచ్చిన అతను, అనుకోని ప్రమాదం కారణంగా తన జ్ఞాపకశక్తిని కోల్పోతాడు. ఇక అసలు కథ అక్కడి నుంచే మొదలవుతుంది. జ్ఞాపకశక్తి కోల్పోవడంతో తాను పాకిస్థాన్ తరఫున గూఢచారిగా వచ్చానన్న విషయాన్ని పూర్తిగా మరచిపోతాడు. అంతేకాదు, భారతదేశంలో ఉంటున్న సమయంలో అతడిలో విపరీతమైన దేశభక్తి పుట్టుకొచ్చి, తనే స్వయంగా ఇండియా కౌంటర్ టెర్రరిజం స్క్వాడ్ ఆఫీసర్ అని బలంగా నమ్ముకుంటాడు. పాకిస్థాన్ పంపిన గూఢచారి అనుకోకుండా ఇండియాకు అనుకూలంగా మారిపోయి, అక్కడే దేశభక్తుడిగా తిరుగుతుండటంతో పాకిస్థాన్ హ్యాండ్లర్లకు తలనొప్పిగా మారుతుంది. అయితే అనంతరం జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. ఇందులో సారా అలీ ఖాన్ పవర్ ఫుల్ సీటీఎస్ ఆఫీసర్‌గా సందడి చేయనున్నారు.ఈ చిత్రంతో ఆకాష్ కౌశిక్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, కరణ్ జోహార్‌కు చెందిన 'ధర్మ ప్రొడక్షన్స్' మరియు గునీత్ మోంగాకు చెందిన 'సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్' సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో రాహుల్ బోస్, రామ్ కపూర్, గుషన్ గ్రోవర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.